
అంతరిక్షంలో డేటా సెంటర్లు

2


# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - శుక్రవారం 6 ఫిబ్రవరి 2026 | సంపుటి: 10 | సంచిక: 34 | పేజీలు: 8+4 | వెల: రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM



జపాన్‌లో భారీ హిమపాతం




2



"ఇది ప్రజల మనోభావాలకు సంబంధించిన విషయం. శ్రీ వేంకటేశ్వర స్వామి మా ఇంటిదైవం గత పాలనలో శ్రీవారి ప్రసాదం విషయంలో అపచారం చోటు చేసుకుంది. బూతులు మాట్లాడుతూ, రౌడీయిజం చేస్తూ, మేము అనుకున్నదే ప్రజలు వినాలి, చూడాలి అంటే, చూస్తూ ఊరుకునే వాళ్ళు ఎవరూ లేరు.కరుడుగట్టిన నేరస్థుడు ఏ విధంగా అసత్యాన్ని నమ్మించాలని చేస్తాడోఅదే వైఎస్ జగన్ చేస్తున్నాడు..తిరుమల లడ్డూ కల్తీ అనేది, డబ్బుల కోసం చేసింది కాదు. ఇది హిందూ మతం పై ఒక పెద్ద కుట్ర. వెంకటేశ్వర స్వామి పవిత్రతను దెబ్బ తీసే కుట్రఅని'' సీఎం చంద్రబాబు అన్నారు.

# భక్తుల మనోభావాలతో ఆటలా

## తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి వివాదంపై ఏకసభ్య కమిటీ

### వైసీపీ చేసింది మహా పాపం.. నివేదికలన్నీ సమర్పిస్తాం

- గత వైసీపీ ప్రభుత్వం 2022 నివేదికను ఉద్దేశపూర్వకంగా తొక్కిపెట్టిందని ఆరోపణ
- దేవుడితో పెటుకున్నారు.. గత ఐదేళ్లలో హిందూమతంపై దాడి
- సీఎంగా బాధ్యతలు చేపట్టగానే ప్రక్షాళన మొదలుపెట్టానని వెల్లడి
- పామాయిల్, కెమికల్స్, జంతువుల కొవ్వుతో నెయ్యి తయారు చేశారని ఆగ్రహం
- దేవుడితో పెట్టుకోవద్దని, భక్తుల మనోభావాలను దెబ్బతీయొద్దని తీవ్ర హెచ్చరిక
- తిరుమల నెయ్యి కల్తీపై సీఎం చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజం

**విజయవాడ, మనంప్రత్యేక ప్రతినిధి:** కరడుగట్టిన నేరస్థులు అసత్యాన్ని ఎలా నమ్మిస్తారో, అలాగే గత పాలకులు ఇప్పుడు మాట్లాడుతున్నారని చంద్రబాబు అన్నారు. 'సీబీఐ నివేదికలో కల్తీ లేదని ఎక్కడా చెప్పలేదు. అయినా, కల్తీ జరగలేదని ఎదురుదాడి చేస్తున్నారు. ఇది మంచి పద్ధతి కాదు. రాష్ట్రంలోని భక్తులందరికీ ఒక సామాన్య భక్తుడిగా విజ్ఞప్తి చేస్తున్నా. దేవునికి అపచారం జరిగినప్పుడు ముక్తకంఠంతో ఖండించాలి. ఈ దోషులను కఠినంగా శిక్షిస్తాం. ఏకసభ్య కమిషన్ వేసి సమగ్ర విచారణ జరిపిస్తాం. ఇప్పటివరకు ఉన్న నివేదికలన్నీ ఆ కమిషన్ ముందు ఉంచుతాం. అవసరమైతే కోర్టులోనూ అదనపు సమాచారం సమర్పిస్తాం. ఇది దేవుడిచ్చిన బాధ్యత, దైవ కార్యం. ఇలాంటివి పునరావృతం కాకుండా చూస్తాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

**దేవుడితో పెట్టుకోవద్దు..**
**ఇది దుర్మార్గమైన అపచారం...**

వైసీపీ నేతలకు దేవుడిపై విశ్వాసం లేకపోవచ్చని, కానీ విశ్వాసం ఉన్న కోట్ల మంది భక్తుల మనోభావాలను దెబ్బతీసే హక్కు వారికి లేదని చంద్రబాబు హెచ్చరించారు. 'అంతర్వేదిలో రథం తగలబడితే కందిరీగలు కొరికాయని, ఆంజనేయుడి విగ్రహాన్ని పగలగొడితే 'అదో బొమ్మే కదా, ఇంకోటి పెట్టుకోండి' అని అప్పటి పాలకులు

...మిగతా 2లో

# హిందూ మత గౌరవం కాపాడుతున్నాం

## గత ప్రభుత్వం దేవుడిపైనే పగబట్టింది

- ఇది హిందువుల మనోభావాలను దెబ్బతీయడమే
- ఈ వ్యవహారంలో ఎక్కడా సీబీఐ క్లీన్ చిట్ ఇవ్వలేదు
- వాస్తవాలు బయటపెడతాం
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



**విజయవాడ, మనంప్రత్యేక ప్రతినిధి:** ఏపీ పాలిటిక్స్లో తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి వ్యవహారం కాకరేపుతోంది.. సీబీఐ క్లీన్ చిట్ ఇచ్చిందని చెబుతున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్.. సీఎం చంద్రబాబుతో కూటమి నేతల కీలక భేటీ తర్వాత జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తిరుమల లడ్డూ వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ, అయోధ్యకు కూడా కల్తీ లడ్డూలు పంపిన ఘటనలు వెలుగులోకి వచ్చాయని ఆరోపించారు. ఇది యాదృచ్ఛికంగా జరిగిన తప్పు కాదని, కావాలనే, తెలిసే చేసిన చర్యలేనని అన్నారు. 'తిరుమల తిరుపతి దేవస్థానానికి (టీటీడీ) ఓ నిర్దిష్ట కంపెనీ 59.70 లక్షల కిలోల నెయ్యి సరఫరా చేసినట్లు అధికారికంగా లెక్కలు చూపింది. కానీ, మా వద్ద ఉన్న ఆధారాల ప్రకారం, అదే కంపెనీ 58 లక్షల కిలోలకు పైగా పామాయిల్, దానికి సంబంధించిన ప్లాంట్ బేస్డ్ ఉత్పత్తులను కొనుగోలు చేసింది. అంతేకాకుండా, సుమారు 1.70 లక్షల నుంచి 2 లక్షల కిలోల వరకు రసాయనాలను కూడా కొనుగోలు చేసినట్లు ఆన్ రికార్డ్ ఆధారాలున్నాయి. నెయ్యి సరఫరా చేస్తున్నామని చెప్పి, పామాయిల్, రసాయనాలు కొనుగోలు చేయడం వెనుక ఉన్న మతలబు ఏంటి? ఇది కల్తీ నెయ్యి కాదు, కల్తీ వనస్పతి, కల్తీ పామాయిల్' అని పవన్ వివరించారు.

ఈ కుంభకోణం కేవలం తిరుమలతోనే ఆగిపోలేదని, అయోధ్య రామమందిర ప్రాణప్రతిష్ఠ మహోత్సవానికి కూడా ఇక్కడి నుంచి పంపిన లక్ష లడ్డూలు సైతం

...మిగతా 2లో

# 40 ఏళ్ల తర్వాత న్యాయం నిర్దోషిగా 100 ఏళ్ల వృద్ధుడు

**అలహాబాద్, ఫిబ్రవరి 5:** దశాబ్దాల నిరీక్షణ తర్వాత 100 ఏళ్ల వృద్ధుడికి న్యాయం దక్కింది. 40 ఏళ్ల తర్వాత హత్య కేసులో అతడిని నిర్దోషిగా తేలుస్తూ అలహాబాద్ హైకోర్టు తాజాగా తీర్పునిచ్చింది. జాతీయ మీడియా కథనాల ప్రకారం..

ఓ భూవివాదం కాస్తా తీవ్రరూపం దాల్చి, ఒకరి హత్యకు దారితీసింది. ఉత్తరప్రదేశ్‌లో 1982లో జరిగిన ఈ హత్య ఘటనలో మైకు ప్రధాన నిందితుడు కాగా.. ధనీరామ్, సత్తిదిన్ హత్యకు ప్రేరేపించారని అభియోగాలు నమోదయ్యాయి. ఈ కేసును విచారించిన హమీర్‌పూర్ సెషన్స్ కోర్టు 1984లో ధనీరామ్, సత్తిదిన్‌కు జీవితఖైదు విధించింది. మైకు మాత్రం అరెస్టు కాలేదు. సెషన్స్ కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ.. ఆ ఇద్దరు 40 ఏళ్ల క్రితం అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. అప్పటినుంచి ఆ పిటిషన్ పెండింగ్‌లోనే ఉండిపోయింది. అది విచారణ దశలో ఉండటంతో బెయిల్‌కు దరఖాస్తు చేసుకోగా.. మంజూరైంది. ఈ కేసు ఎటూ తేలకుండానే కొన్నేళ్లక్రితం సత్తిదిన్ మృతి చెందాడు. ఈ హత్య కేసు తాజాగా హైకోర్టులో విచారణ జరిగింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు మైకుని అరెస్టు

...మిగతా 2లో





# సీమకు నీళ్లు తెచ్చిందే టీడీపీ

- జలం-మన బలం
- సాగునీటి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యం
- పరుగెత్తే నీటిని నిలపాలి
- సీఎం చంద్రబాబు

**విజయవాడ, మనంప్రత్యేక ప్రతినిధి:** రాయలసీమలోని ఊట కాలువల్లోనూ నీళ్లు సమృద్ధిగా ఉండేవని గుర్తు చేశారు సీఎం చంద్రబాబు. రాయలసీమ రాళ్ల సీమగా మారకుండా రతనాల సీమగా మార్చాలని టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ సీఎం ఎన్టీఆర్.. ప్రాజెక్టులు చేపట్టారని వివరించారు. . రాష్ట్రంలో భూగర్భ జలాలు ఏమేరకు ఉన్నాయి, భూగర్భజలాల రీఛార్జి స్ట్రక్చర్ల నిర్మాణం తదితర అంశాలను పరిశీలించారు. ప్రదర్శన వద్ద వ్యవయసాయానికి ఉపయోగపడే డ్రోన్లు, రిమోట్ కంట్రోల్ ద్వారా ఆపరేట్ చేసే వ్యవసాయ మోటార్ల సాంకేతికతను ముఖ్యమంత్రి ఆసక్తిగా పరిశీలించారు. నీటి వినియోగదారుల సంఘాల సమావేశానికి మంత్రులు నిమ్మల రామానాయుడు, కె.అచ్చెన్నాయుడు, కందుల దుర్గేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ తదితరులు హాజరయ్యారు. టీడీపీ చూపిన చొరవ కారణంగానే హంద్రీనీవా, గాలేరు- నగరి, తెలుగు గంగ

...మిగతా 2లో

# ఎన్నికలకు ముందు ఉచితాలపై పిల్

## విచారణకు సుప్రీం అంగీకారం



**ఢిల్లీ, ఫిబ్రవరి 5:** ఎన్నికల్లో ఓటర్లను ఆకర్షించేందుకు రాజకీయ పార్టీలు ఎక్కువగా ఉచితాల వైపే దృష్టిసారిస్తాయి. ఈ ఉచిత హామీలకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు లో పిల్ దాఖలైంది. తాజాగా దాన్ని విచారించేందుకు అత్యున్నత న్యాయస్థానం అంగీకరించింది.

న్యాయవాది అశ్విని ఉపాధ్యాయ ఈ పిల్‌ను దాఖలు చేశారు. అందులో ఎన్నికలకు ముందు అసంబద్ధమైన 'ఉచిత' హామీలు ఇచ్చే రాజకీయ పార్టీల గుర్తులు, వాటి రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని ఆయన కోరారు. తన పిల్‌పై 2022లోనే కేంద్రం, ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ అయ్యాయని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా

...మిగతా 2లో

## పండ్లు, కూరగాయలపై సున్నా శాతమే

# 99% ఉత్పత్తులపై సుంకాలుండవ్

- కొన్నింటిపై మాత్రమే భారత్‌కు నియంత్రణ
- రష్యా చమురును నిలిపేస్తామని భారత్ అంగీకరించింది
- వాణిజ్య ఒప్పందంపై అమెరికా స్పష్టీకరణ

**న్యూయార్క్, ఫిబ్రవరి 5:** అమెరికా నుంచి దిగుమతి చేసుకునే 98% నుంచి 99% ఉత్పత్తులపై భారత్ సున్నా శాతం సుంకాలను అమలు చేయనుందని అమెరికా పేర్కొంది. పండ్లు, కూరగాయలుసహా వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తులపై సుంకాలు ఉండబోవని స్పష్టం చేసింది. కొన్ని కీలక ఉత్పత్తులపై మాత్రం భారత్ నియంత్రణ ఉంటుందని వెల్లడించింది. మరోవైపు రష్యా

...మిగతా 2లో



# 8 గంటలు ట్రాఫిక్‌లో చివరికి హెలికాప్టర్లో..

**ముంబయి, ఫిబ్రవరి 5:** ముంబయి- పుణె ఎక్స్‌ప్రెస్‌వేపై కొన్ని గంటలపాటు ట్రాఫిక్ నిలిచిపోయిన నేపథ్యంలో ఓ వ్యాపారవేత్త కూడా ట్రాఫిక్‌లో చిక్కుకుపోగా.. కొంతసేపటి తర్వాత హెలికాప్టర్ ద్వారా ఆయన అక్కడినుంచి బయటపడ్డారు. దీనికి సంబంధించి ఆయన పెట్టిన ఓ పోస్టు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతుంది. మహారాష్ట్రలోని రాయ్‌గడ్ జిల్లా అదోషీ టన్నెల్ సమీపంలో గ్యాస్ ట్యాంకర్ బోల్తా పడింది. దాని నుంచి ప్రమాదకరమైన వాయువు లీకవుతుండటంతో అధికారులు రాకపోకలు నిలిపివేశారు. ఈ క్రమంలో వేల మంది వాహనదారులు ఎక్స్‌ప్రెస్‌వేపై చిక్కుకుపోయారు. అందులో ఎకా మొబిలిటీ సంస్థ ఛైర్మన్ డాక్టర్ సుధీర్ మెహతా కూడా ఉన్నారు. ఎనిమిది గంటలకు పైగా రోడ్డుపై కారులోనే ఉండిపోయిన ఆయన.. ఆ తర్వాత అత్యవసరంగా

...మిగతా 2లో

## బొగ్గుగనిలో పేలుడు..

# 10 మంది కూలీల మృతి





**షిల్లాంగ్, ఫిబ్రవరి 5:** మేఘాలయలో బొగ్గుగనిలో గురువారం భారీ ప్రమాదం జరిగింది. అందులో పేలుడు సంభవించడంతో 10 మంది కూలీలు ప్రాణాలు కోల్పోయారు. తూర్పు జైంతియా హిల్స్ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు వెల్లడించిన కథనాల ప్రకారం.. గనిలో బొగ్గు తవ్వకాలు చేపడుతోన్న సమయంలో ఈ పేలుడు జరిగింది. దాంతో కూలీలు అందులో చిక్కుకుపోయారు. వారిలో

...మిగతా 2లో

# నైజీరియాలో ఘోరం.. 200 మంది ఊచకోత



**అబూజా, ఫిబ్రవరి 5:** నైజీరియా లో సాయుధమూక నరమేధం సృష్టించింది. రెండు గ్రామాల్లోని ప్రజలపై దాడులు చేసి.. 200 మందిని అతి దారుణంగా చంపేశారు. పలు ఇళ్లు, దుకాణాలను కూడా తగలబెట్టారు. క్వారా రాష్ట్రంలోని వోరో, నూక అనే రెండు గ్రామాల్లో ఈ దాడులు జరిగాయి. వోరో స్థానిక నాయకుడు సైదు బాబా అహ్మద్ మాట్లాడుతూ.. ప్రజలను చుట్టుముట్టి, వారి చేతులను వెనక్కి కట్టి ఆ తర్వాత కాల్చి చంపేశారని తెలిపారు. దాడి సమయంలో

...మిగతా 2లో

# జపాన్‌లో భారీ హిమపాతం

- 35 మంది మృతి

**టోక్యో, ఫిబ్రవరి 5:** ఉత్తర జపాన్‌లోని దాదాపు 15 ప్రాంతాలను రెండు వారాలుగా భారీ హిమపాతం ముంచెత్తుతోంది. మంచు ధాటికి దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 35 మంది మరణించగా, 300 మందికి పైగా గాయపడినట్లు అధికారులు వెల్లడించారు. తమ ఇంటిపై పేరుకుపోయిన మంచును తొలగించే క్రమంలో కిందికి జారిపడటం, హఠాత్తుగా గుండెపోటుకు గురవడం లాంటి కారణాలతో పలువురు ప్రాణాలు కోల్పోయారని, మరికొందరు గాయపడ్డారని పేర్కొన్నారు.

సుమారు 2 మీటర్ల మేర మంచు పేరుకుపోవడంతో దేశవ్యాప్తంగా రైళ్లు, రవాణా వ్యవస్థతో పాటు ఇతర ప్రజాసేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందన్నారు. 1,700కు పైగా ఇళ్లకు విద్యుత్తు సరఫరా నిలిచిపోయినట్లు చెప్పారు. ఇంత అధికంగా మంచు కురవడం గత 40 ఏళ్లలో ఇదే మొదటిసారని.. రానున్న రోజుల్లో హిమపాతం మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని తెలిపారు.

# అంతరిక్షంలో డేటా సెంటర్లు

- 10లక్షల ఉపగ్రహాలు
- మస్క్ కొత్త ప్లాన్

**వాషింగ్టన్, ఫిబ్రవరి 5:** ప్రపంచ అపర కుబేరుడు, టెస్లా, స్పేస్ఎక్స్ సంస్థల అధినేత ఎలాన్ మస్క్ తన వ్యాపార సామ్రాజ్యాన్ని మరింత విస్తరించేందుకు సిద్ధమయ్యారు. ఇందుకోసం కొత్త ప్రణాళికలను ప్రకటించారు. అంతరిక్షంలో డేటా సెంటర్లు ఏర్పాటుచేయాలని యోచిస్తున్నట్లు తెలిపారు. ఇక, కక్ష్యలోకి 10 లక్షల ఉపగ్రహాలను పంపడమే తన లక్ష్యమని మస్క్ వెల్లడించారు. ఈ ప్రణాళికలకు ఆర్థిక సహకారం కోసం ఇటీవల స్పేస్ఎక్స్ సంస్థలో తన ఏఐ వ్యాపారాన్ని విలీనం చేశారు. ఈ రెండింటితో కలిసి ఏర్పాటైన సంస్థ త్వరలోనే ఐపీఓకు వెళ్లనున్నట్లు ప్రకటించారు. ''ప్రస్తుతం అందుబాటులో ఉన్న కృత్రిమ మేధ (ఏఐ) వ్యవస్థలకు పెద్ద మొత్తంలో విద్యుత్, కూలింగ్ సిస్టమ్స్ అవసరం. ఇవి భూమిపైన పెద్ద సంఖ్యలో డేటా సెంటర్లపై ఆధారపడి పని చేస్తున్నాయి. భవిష్యత్తులో ఏఐ వినియోగం మరింత పెరిగిన తర్వాత ఈ డేటా సెంటర్లు సరిపోవు. సుదీర్ఘకాలంలో దీనికి అంతరిక్ష ఆధారిత ఏఐ ఒక్కటే పరిష్కారం. అందుకే అంతరిక్షంలో డేటా సెంటర్లను ఏర్పాటుచేయాలనుకుంటున్నా. సౌరశక్తితో వాటికి విద్యుత్ సరఫరా అందించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నా. ఇక, అంతరిక్ష ఆధారిత డేటా సెంటర్లకు పెద్దసంఖ్యలో శాటిలైట్లు అవసరం. అందుకే కక్ష్యలోకి 10 లక్షల ఉపగ్రహాలు పంపిస్తాం'' అని మస్క్ వివరించారు.

అయితే, మస్క్ ప్రణాళికలకు సాంకేతికంగా, ఆర్థికంగా సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు, పరిశ్రమ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. చాట్‌బాట్లు, ఇతర ఏఐ టూల్స్‌ను నిర్వహించడం కోసం అంతరిక్షం నుంచి సౌరశక్తిని తీసుకోవడం వల్ల పవర్‌గ్రిడ్లపై ఒత్తిడికి తగ్గినప్పటికీ.. ఇందుకు కొన్ని సమస్యలు లేకపోలేదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. డేటా సెంటర్లు పెద్ద మొత్తంలో వేడిని ఉత్పత్తి చేస్తాయని, దీంతో భూమ్మీదతో పోలిస్తే అంతరిక్షంలో కంప్యూటర్ చిప్లు మరింత వేగంగా ఓవర్‌హీట్ అవుతాయని హెచ్చరిస్తున్నారు.

ఇక, ఉపగ్రహాల సంఖ్య పెరిగితే మరో సమస్య ఎదురవుతుందని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కక్ష్యలో ఏదైనా ఉపగ్రహం విఫలమైతే అది ఇతర శాటిలైట్లను ఢీకొట్టే ప్రమాదం ఉంటుంది. ఇప్పటికే స్టార్లింక్కు చెందిన దాదాపు 10వేల ఉపగ్రహాలు కక్ష్యలో తిరుగుతున్నాయి. ఇప్పుడు 10లక్షల శాటిలైట్లు ప్రయోగిస్తే.. అప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశం మరింత ఎక్కువగా ఉంటుందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు.

# భక్తుల మనోభావాలతో ఆటలా

(మొదటి పేజీ తరువాయి)

ఎంతో గర్వంగా మాట్లాడారు. ఇవన్నీ చేస్తూ, తిరిగి మాపైనే నిందలు వేశారు. విశ్వాసం లేకపోతే దేవుడి జోలికి రావొద్దు. దేవుడి పవిత్రతను దెబ్బతీయడం దుర్మార్గం. చరిత్రలో ఇప్పటివరకు శ్రీ వెంకటేశ్వర స్వామి జోలికి ఎవరూ రాలేదు. బ్రిటిష్ వాళ్లు కూడా స్వామివారి సంప్రదాయాలను గౌరవించి, మరింత అభివృద్ధి చేశారు. అలాంటిది మీరు చేసిన ఈ పని దుర్మార్గమైన అపచారం' అని ఆయన తీవ్రంగా ఖండించారు.

**సీఎంగా బాధ్యతలు చేపట్టగానే ప్రక్షాళన...**

తాను ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తొలి ప్రాధాన్యతగా పరిపాలన, దైవ కార్యాల ప్రక్షాళనపై దృష్టి సారించానని చంద్రబాబు వివరించారు. 'ముఖ్యమంత్రిగా నా కార్యకలాపాలు ప్రారంభించేందుకు ఒక ప్రిన్సిపల్ సెక్రటరీని నియమించడం నా మొదటి సంతకం. మానవ సేవ కన్నా ముందు మాధవ సేవ ముఖ్యమని భావించి, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తిరుమల ప్రక్షాళన కోసం టీటీడీ ఈఓగా శామలరావును నియమిస్తూ రెండో సంతకం చేశాను. ఈ రెండు పనులు పూర్తి చేశాకే ఇతర కార్యక్రమాలు చేపట్టాను' అని ఆయన తెలిపారు. అనంతరం తిరుమలలో పరిస్థితులను సమీక్షించి, కల్తీ జరుగుతోందన్న అనుమానంతో నెయ్యి శాంపిళ్లను నేషనల్ డెయిరీ డెవలప్మెంట్ బోర్డ్ (ఎన్డీడీబీ)కు పంపించామని, ఆ నివేదికలోనే కల్తీ వాస్తవాలు బయటపడ్డాయని స్పష్టం చేశారు.

**2022లోనే నివేదిక.. అయినా తొక్కిపెట్టారు**

ఈ కల్తీ వ్యవహారం కొత్తగా బయటపడింది కాదని, 2022లోనే గత వైసీపీ ప్రభుత్వానికి దీనిపై నివేదిక అందిందని చంద్రబాబు సంచలన విషయాలు వెల్లడించారు. 2022లో సీఎఫ్టీఆర్ఐ ఇచ్చిన నివేదికలో నెయ్యి కల్తీ జరుగుతోందని చాలా స్పష్టంగా ఉంది. కానీ, ఆ నివేదికను వాళ్లు ఉద్దేశపూర్వకంగా తొక్కిపెట్టారు. యథేచ్ఛగా కల్తీ నెయ్యి సరఫరాను కొనసాగించారు' అని ఆయన ఆరోపించారు. ఇప్పుడు ఏర్పాటైన సిట్ విచారణలో మరింత భయంకరమైన నిజాలు బయటపడ్డాయని, నెయ్యి తయారీలో పామాయిల్, ప్రమాదకర రసాయనాలు, చివరికి జంతువుల కొవ్వు (యానిమల్ ఫ్యాట్) కూడా వాడుతున్నట్లు తేలిందని ముఖ్యమంత్రి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

**గత ఐదేళ్లలో హిందూమతంపై దాడి**

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో హిందూ దేవాలయాలు, సంప్రదాయాలపై దాడులు పరాకాష్టకు చేరాయని చంద్రబాబు విమర్శించారు. 'ఒకప్పుడు ఇదే అసెంబ్లీలో తిరుమల రెండు కొండలే, ఏడు కొండలు కాదని మాట్లాడినప్పుడు మేం వ్యతిరేకించాం. విజయనగరంలో రాముడి విగ్రహం తల నరికివేస్తే, అక్కడికి వెళ్లి వాస్తవాలు తెలుసుకోవాలనుకున్న నాపైనే కేసు పెట్టారు. అంతర్వేదిలో రథం తగలబడితే ఎలుకలు కొరికాయని చెప్పారు.

# 99% ఉత్పత్తులపై సుంకాలుండవ్

(మొదటి పేజీ తరువాయి)

నుంచి చమురు దిగుమతులను నిలిపేస్తామని భారత్ హామీ ఇచ్చిందని వివరించింది. మంగళవారం సీఎన్బీసీ కార్యక్రమంలో భారత్తో వాణిజ్య ఒప్పందంపై అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమిసన్ గ్రీర్ స్పందించారు. భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందంపై శ్వేతసౌధం మీడియా కార్యదర్శి కరోలినా లీవిట్ మీడియాతోనూ, ఫాక్స్ న్యూస్‌తో మాట్లాడారు.

'భారత్‌పై అమెరికా 18శాతం సుంకాలను కొనసాగిస్తుంది. ఆ దేశంతో మాకు వాణిజ్య లోటు ఉంది. వారు పలురకాల వ్యవసాయ ఉత్పత్తులు, తయారీ వస్తువులు, రసాయనాలు, వైద్య పరికరాలపై సుంకాలను తగ్గిస్తామని అంగీకరించారు. ప్రస్తుతం భారత్‌లో అమెరికా పారిశ్రామిక ఉత్పత్తులపై సగటున 13.5 శాతం సుంకాలున్నాయి. అవి సున్నాకు చేరతాయి. కానీ బాదం, పిస్తా వంటి ఉత్పత్తులు, వైన్, ఆల్కహాల్ పానీయాలు, పండ్లు, కూరగాయలపై సున్నా శాతం సుంకాలే అమలవుతాయి. ఇది పెద్ద విజయం' అని గ్రీర్ పేర్కొన్నారు.

2022-23కు ముందు రష్యా నుంచి భారత్ ముడి చమురును దిగుమతి చేసుకోలేదు. కానీ ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమయ్యాక రష్యా ఇచ్చిన రాయితీల నుంచి లబ్ధి పొందేందుకు చమురు దిగుమతులు చేసుకుంది. ట్రంప్ హెచ్చరికలతో గత ఏడాది నుంచి చమురు దిగుమతులను తగ్గిస్తూ వస్తోంది' అని గ్రీర్ స్పష్టం చేశారు.

**మోడీతో బంధాన్ని ట్రంప్ ఆస్వాదిస్తారు...**

ప్రధాని మోడీతో బంధాన్ని ట్రంప్ ఆస్వాదిస్తారని, ఆయనపై అధ్యక్షుడికి ఎంతో గౌరవముందని శ్వేతసౌధం మీడియా కార్యదర్శి లీవిట్ పేర్కొన్నారు. 'వాణిజ్య ఒప్పందం తర్వాత భారత్పై అమెరికా 18శాతం సుంకాలను విధిస్తుంది. అమెరికా ఉత్పత్తులపై భారత్ సున్నా సుంకాలను అమలు చేస్తుంది. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను నిలిపేస్తామని భారత్ హామీ ఇచ్చింది. అమెరికా, వెనెజువెలా నుంచి దిగుమతి చేసుకుంటామని అంగీకరించింది. అమెరికాలోని కీలక రంగాల్లో 500 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెడతామని మోడీ హామీ ఇచ్చారు' అని వివరించారు. త్వరలో కుదరనున్న భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని రెండు దేశాల విదేశాంగ మంత్రులు జైశంకర్, మార్కో రుబియో స్వాగతించారు. కీలక ఖనిజాలపై జరగనున్న సదస్సులో పాల్గొనేందుకు అమెరికా చేరుకున్న జైశంకర్.. రుబియోతో భేటీ అయ్యారు. క్వాడ్ ద్వారా ద్వైపాక్షిక, బహుళపక్ష సహకారాన్ని విస్తరించుకోవడానికి కట్టుబడి ఉన్నామని వారు తెలిపారు.



## 8 గంటలు ట్రాఫిక్‌లో చివరికి హెలికాప్టర్లో..

(మొదటి పేజీ తరువాయి)

హెలికాప్టర్‌ను ఏర్పాటుచేయించుకొని ట్రాఫిక్‌లోనుంచి బయటపడ్డారు. 'ఒకే ఒక్క గ్యాస్ ట్యాంకర్ కారణంగా అనేకమంది ప్రజలు గంటలతరబడి రోడ్డు పైనే ఉండిపోయారు. ఎక్స్‌ప్రెస్‌వేపై ఇలాంటి అత్యవసర పరిస్థితుల సమయంలో వాహనాలు వెనక్కి తిరిగివెళ్లేలా.. ఎగ్జిట్ పాయింట్లు ఉండాలి. హెలిప్యాడ్ల నిర్మాణానికి రూ.10 లక్షల కంటే తక్కువ ఖర్చవుతుంది. ఎక్స్‌ప్రెస్ మార్గాల వద్ద వీటిని తప్పనిసరిగా ఏర్పాటుచేయాలి' అని మెహతా ఎక్స్‌లో రాసుకొచ్చారు.

## 40 ఏళ్ల తర్వాత న్యాయం

(మొదటి పేజీ తరువాయి)

నిర్దోషిగా 100 ఏళ్ల వృద్ధుడు చేయకపోవడాన్ని కోర్టు ప్రస్తావించింది. ధనీరామ్ అప్పీల్‌పై నిర్ణయంలో అసాధారణ జాప్యం, ప్రాసిక్యూషన్‌లో లోపాలను ఎత్తిచూపిన న్యాయస్థానం.. తాజాగా తీర్పునిచ్చింది. అలాగే అతడి వయసును పరిగణనలోకి తీసుకొని నిర్దోషిగా తేల్చింది.

# హిందూ మత గౌరవం కాపాడుతున్నాం

(మొదటి పేజీ తరువాయి)

ఈ కల్తీ నెయ్యితో తయారు చేసినవేనని పవన్ ఆరోపించారు. దేశమంతా ఎంతో పవిత్రంగా జరుపుకున్న కార్యక్రమానికి సైతం కల్తీ లడ్డూలు పంపి హిందువుల మనోభావాలను తీవ్రంగా గాయపరిచారని ఆయన మండిపడ్డారు.

2019-2024 మధ్య వైసీపీ పాలనలో రాష్ట్రం నలుమూలల 200కుపైగా మత సంబంధిత ఘటనలు చోటుచేసుకున్నాయని పవన్ కల్యాణ్ తెలిపారు. తిరుమల లడ్డూలో ఫిష్ ఆయిల్ ఉన్నట్టు నివేదికలు రావడం అత్యంత ఆందోళనకరమని అన్నారు. రాజకీయ లాభనష్టాలు ఆలోచించకుండా, తెలిసిన నిజాన్ని చెప్పకపోతే అది తప్పవుతుందని స్పష్టం చేశారు. గత పాలకులు భగవంతుడిపై పగ పట్టినట్లుగా వ్యవహరించారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పిఠాపురంలో అశుద్ధంతో విగ్రహాలు తయారు చేసిన ఘటనలు ఉన్నాయి.. దుర్గమ్మ ఆలయంలో వెండి విగ్రహాల చోరీ జరిగితే 'ఇంకోటి కొనుక్కోవచ్చు' అన్న ధోరణి.. అంతర్వేదిలో రథం అగ్నికి ఆహుతి కావడం.. ఇలాంటి అనేక సంఘటనలు వైసీపీ పాలనలో జరిగాయని గుర్తు చేశారు.

**ఎన్డిడిబి నివేదికే ఆధారం**

తిరుమల లడ్డూ తయారీలో ఉపయోగించిన నెయ్యిలో స్వచ్ఛమైన నెయ్యి లేదని ఎన్డీడీబీ నివేదిక స్పష్టంగా తేల్చిందని పవన్ కల్యాణ్ తెలిపారు. ఆ నివేదిక ఆధారంగానే సీఎం చంద్రబాబు నాయుడు ప్రజలకు నిజాలు వెల్లడించారని చెప్పారు. 319 రూపాయలకు నెయ్యి సరఫరా జరిగిందంటే ఎంత స్థాయిలో కల్తీ జరిగిందో అందరికీ అర్థమవుతుందన్నారు. ఇక, ఈ వ్యవహారంపై వచ్చిన సీబీఐ నివేదిక ఎక్కడా క్లీన్ చీట్ ఇవ్వలేదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఎన్డీడీబీ నివేదికలో ఫిష్ ఆయిల్, పంది కొవ్వు, రసాయనాలు ఉండే అవకాశాలున్నాయని పేర్కొనడం మరింత తీవ్ర విషయమని అన్నారు. అయితే, తప్పు జరిగిందని ఒప్పుకోకుండా, పశ్చాత్తాపం చూపకుండా, తిరిగి 'ఎలాంటి తప్పులు జరగలేద'ని ప్రచారం చేయడం దుర్మార్గమని విమర్శించారు. వైసీపీ ఈ వ్యవహారంపై తప్పకుండా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

**హిందూ మత గౌరవం కాపాడుతున్నాం**

తాము హిందూ మత గౌరవాన్ని కాపాడుతున్నామని, కానీ ఇతర మతాలను ఎక్కడా అగౌరవపరచడం లేదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఇది ఒక మతానికి సంబంధించిన విషయం కాదని, భక్తుల విశ్వాసాలపై జరిగిన దాడిగా అభివర్ణించారు. ఈ వ్యవహారం ఇక్కడితో ఆగదని, మళ్లీ నివేదికలు వచ్చేందుకు సమయం పడుతుందని, అప్పటివరకు నిజాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తాయని పవన్ కల్యాణ్ హెచ్చరించారు. 'ఏడు కొండల వారితో పెట్టుకుంటే మట్టి కొట్టుకుపోతుంది' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి.



## 10 మంది కూలీల మృతి

(మొదటి పేజీ తరువాయి)

ఎక్కువమంది అస్సాంకు చెందినవారిగా తెలుస్తోంది. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ గనిని అక్రమంగా నిర్వహిస్తున్నట్లు అనుమానాలు ఉన్నాయి. అయితే పేలుడుకు గల కారణాలు మాత్రం తెలియాల్సి ఉంది. మేఘాలయలో ర్యాట్‌హోల్ మైనింగ్, అశాస్త్రీయ పద్ధతుల్లో తవ్వకాలను 2014లోనే జాతీయ హరిత ట్రైబ్యునల్ నిషేధించింది. సమాంతరంగా సన్నని గుంతలు తవ్వుతూ బొగ్గును బయటకు తీసే పద్ధతినే ర్యాట్ హోల్ మైనింగ్‌గా వ్యవహరిస్తారు. ఇలా నేలలో ఇరుకైన గుంతలను తవ్వడాన్నే ర్యాట్ హోల్‌గా పేర్కొంటారు. సుమారు నాలుగు అడుగుల వెడల్పుతో మాత్రమే ఉంటుంది. కేవలం ఒక్క మనిషి మాత్రమే వెళ్లగలడు. కాగా.. ఎన్‌జీటీ నిషేధాన్ని సుప్రీంకోర్టు కూడా సమర్థించింది.

## ఎన్నికలకు ముందు ఉచితాలపై పిల్

(మొదటి పేజీ తరువాయి)

బాగ్చీలతో కూడిన ధర్మాసనం దృష్టికి పిటిషనర్ తీసుకెళ్లారు. దీనిపై త్వరగా విచారణ జరపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆచరణ సాధ్యం కాని వాగ్దానాలు ఓటర్లను ప్రభావితం చేస్తాయని.. ఇది ఎన్నికల ప్రక్రియ స్వచ్ఛతను దెబ్బతీస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో ఓ చట్టాన్ని రూపొందించేలా కేంద్రాన్ని ఆదేశించాలని న్యాయస్థానాన్ని కోరారు. ధర్మాసనం దీన్ని తీవ్రమైన సమస్యగా పేర్కొంటూ.. దీనిపై మార్చి చివరిలో విచారణ జరిపేందుకు అంగీకరించింది.

## మరో రెండేళ్లలో కేసీఆరే సీఎం

**బాగా చూసుకునోళ్లకే ఓటేయండి**

**ఎమ్మెల్యే హరీశ్‌రావు**

**హైదరాబాద్,ఫిబ్రవరి 5(మనం,ప్రత్యేక ప్రతినిధి):** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మరో రెండేళ్లలో మరోసారి ముఖ్యమంత్రి అవుతారని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక మిగిలిన అభివృద్ధి పనులు పూర్తి చేసుకుందామని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ వాళ్లు ఏమీ చేయరని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న హరీశ్ రావు మాట్లాడుతూ... మనల్ని బాగా చూసుకునే వారికే ఈ మున్సిపల్ ఎన్నికల్లో ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఒకప్పుడు పందులతో ఉన్న గజ్వేల్ ఆసుపత్రి కేసీఆర్ వచ్చాక ఎలా అయిందో అందరూ గుర్తుంచుకోవాలని అన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఎన్నో హామీలు ఇచ్చింది కానీ వాటిని అమలు చేయలేదని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కల్యాణ లక్ష్మి ఇవ్వలేదు? కానీ, బంగారం ధర మాత్రం భారీగా పెరిగిందన్నారు.

# సీమకు నీళ్లు తెచ్చిందే టీడీపీ

(మొదటి పేజీ తరువాయి)

ప్రాజెక్టులు వచ్చాయన్నారు. తెలుగు గంగ ప్రాజెక్ట్.. రాయలసీమను సస్యశ్యామలం చేస్తూ చెన్నై దాహార్తిని తీరుస్తోందని తెలిపారు. నీటి కోసం ప్రాంతాలు, రాష్ట్రాల మధ్య విభేదాలు వచ్చిన పరిస్థితి నెలకొందన్నారు. కావేరీ జల వివాదం అలాంటిదేనని చెప్పారు ముఖ్యమంత్రి. నీటి విలువ తెలిసిన వ్యక్తిగా 'నీరు- మీరు, నీరు- చెట్టు' వంటి కార్యక్రమాల ద్వారా ఇంకుడు గుంతల కార్యక్రమాలు గతంలో చేపట్టామని సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. దీని ద్వారా భూగర్భ జలాలు పెంచేలా భూమినే జలాశయంగా మార్చే ప్రక్రియ చేపట్టినట్లు వివరించారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా అనంతపురంలో చేపడుతున్న జల సంరక్షణ కార్యక్రమాన్ని మన్ కీ బాత్లో ప్రత్యేకంగా ప్రస్తావించారని చెప్పుకొచ్చారు.

**జలం-మన బలం నినాదంతో..**

'జలం-మన బలం' నినాదంతో ఆంధ్రప్రదేశ్ను కరువు రహిత రాష్ట్రంగా మార్చే లక్ష్యంతో అమరావతిలోని పెరేడ్ గ్రౌండ్ వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సాగునీటి సంఘాల అధ్యక్షుల సమావేశం జరిగింది. నీటి భద్రత, వాటర్ మేనేజ్మెంట్, భూగర్భజలాల పెంపుపై సాగునీటి సంఘాలకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. సమావేశ ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన వివిధ ప్రాజెక్టుల నిర్మాణ పురోగతి వివరాలను సీఎం తెలుసుకున్నారు . నీటి కోసం ప్రాంతాలు, రాష్ట్రాల మధ్య విభేదాలు వచ్చిన పరిస్థితి నెలకొందన్నారు. కావేరీ జల వివాదం అలాంటిదేనని చెప్పారు .పది లక్షల ఇంకుడు గుంతలు, మైక్రో ఇరిగేషన్ ద్వారా నీటిని సద్వినియోగం చేస్తున్నామని వివరించారు. అనంతపురం జిల్లాను ఎడారి కాకుండా పండ్ల తోటల వనంగా మార్చామన్నారు. హార్టికల్చర్ హబ్గా మార్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలోని 40 జీవనదుల నీటిని సమర్థంగా వినియోగించుకుంటే కరువనేదే ఉండదన్నారు. ప్రతీ ఎకరాకూ నీటిని ఇచ్చేలా ప్రయత్నాలు చేయాలంటూ నీటి వినియోగదారుల సంఘాల ప్రతినిధులకు సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు.

**పరుగెత్తే నీటిని నిలపండి**

పరుగెత్తే నీటిని నిలపండి, నడిచే నీటిని జలాశయంగా మార్చండి, భూగర్భ జలాశయంలో నీటి నిల్వ పెరిగేలా చూడండంటూ వారికి ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. నీటిని సమర్థవంతంగా వినియోగిస్తామని స్పష్టం చేశారు చంద్రబాబు. నీటి ద్వారా ప్రగతి సాధించి పేదరికాన్ని నిర్మూలిస్తామన్నారు. ప్రతి ఎకరాకు నీళ్లిచ్చే బాధ్యత మీదేనంటూ సాగునీటి సంఘాలకు సూచించారు. ఇక కాల్వల మరమ్మతు పనులు ఇకపై సాగునీటి సంఘాలకే అప్పగిస్తామని వారికి సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. అనంతపురం జిల్లాను హార్టికల్చర్ హబ్గా మార్చేందుకు కృషి చేస్తామని ఆ ప్రాంత ప్రజలకు సీఎం భరోసా ఇచ్చారు. సమయానికి రబీ, ఖరీఫ్ సాగుకు నీరిచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలంటూ రైతులకు ఆయన సూచించారు. రైతులు ఎక్కువ ఆదాయం పొందేలా కార్యాచరణ చేపడతామన్నారు.

## హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నా

**సీఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్, ఫిబ్రవరి 5 (మనం బ్యూరో):** గ్రూప్ 1 నియామకాలపై హైకోర్టు తీర్పును హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఎవరెని కుట్రలు పన్ని ఉద్యోగ నియామకాలను అడ్డుకోవాలని చూసినా వారి కుట్రలు, కుతంత్రాలను ఛేదించి న్యాయ పోరాటంలో విజయం సాధించామని వ్యాఖ్యానించారు. నిరుద్యోగుల కల సాకారం అయ్యే దిశగా ఇదొక గొప్ప విజయమని ఆయన అభివర్ణించారు. గ్రూప్ 1 నియామకాలపై హైకోర్టు తీర్పు నేపథ్యంలో సీఎం సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించారు. గ్రూప్ 1 నియామక ప్రక్రియను అడ్డుకోవడానికి ముందు నుంచీ కొన్ని శక్తులు కుట్రలు పన్నాయని విమర్శించారు. కానీ, ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఎన్ని కోర్టు కేసులు వేసినా చివరకు న్యాయపోరాటంలో నిరుద్యోగుల పక్షాన నిలిచిన ప్రభుత్వం విజయం సాధించిందని పేర్కొన్నారు. ప్రభుత్వ చిత్తశుద్ధిని హైకోర్టు తీర్పు మరోసారి నిరూపించిందన్నారు. గ్రూప్ 1కు ఎంపికైన 563 మంది అభ్యర్థులకు సీఎం అభినందనలు తెలిపారు. వారి కష్టానికి తగిన ప్రతిఫలం లభించిందనీ, భవిష్యత్తులో రాష్ట్ర అభివృద్ధిలో వారు కీలక భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత భర్తీ అవుతున్న తొలి గ్రూప్ 1 అధికారులు మీరే అంటూ సీఎం అభ్యర్థులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

## నైజీరియాలో ఘోరం.. 200 మంది ఊచకోత

(మొదటి పేజీ తరువాయి)

కొంతమంది ప్రజలు ప్రాణభయంతో పరుగులు తీశారని.. ప్రస్తుతం వారి ఆచూకీ తెలియడం లేదని వెల్లడించారు. తాజా ఘటనకు సంబంధించి స్థానిక మీడియాలో వీడియోలు ప్రసారమయ్యాయి. అందులో వీధుల్లో పెద్దఎత్తున మృతదేహాలు పడి ఉన్నట్లు కన్పించాయి. ఈ దృశ్యాలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.అమ్నెస్టీ ఇంటర్నేషనల్ మానవ హక్కుల సంఘం ఈ ఘటనను తీవ్రంగా ఖండించింది. దుండగులు దాదాపు ఐదు నెలల నుంచి గ్రామస్థులకు హెచ్చరిక లేఖలు పంపుతున్నారని.. అయినా భద్రతాపరమైన చర్యలు తీసుకోలేదని మండిపడింది. ఇటీవల నైజీరియా సైన్యం ఉగ్రవాదులకు వ్యతిరేకంగా ఈ ప్రాంతంలో ఆపరేషన్లు నిర్వహించి 150 మందిని మట్టుబెట్టింది. ఈ సైనిక చర్యకు ప్రతిస్పందనగానే తాజా దాడులు జరిగాయని క్వారా గవర్నర్ అబ్దుల్ రెహమాన్ పేర్కొన్నారు. దీన్ని పిరికిపంద చర్యగా అభివర్ణించారు. ఇదిలాఉండగా.. కాట్సినా రాష్ట్రంలో కూడా దుండగులు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో 21 మంది ప్రాణాలు కోల్పోయారని స్థానిక పోలీసులు తెలిపారు.



# గ్రూప్1 అభ్యర్థులకు హైకోర్టులో ఊరట

## సింగిల్ జడ్జి తీర్పు రద్దు

**హైదరాబాద్,ఫిబ్రవరి 5(మనం,ప్రత్యేక ప్రతినిధి):** గ్రూప్-1 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు గురువారం హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఈక్రమంలో నియామకాలపై సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సీజే ధర్మాసనం రద్దు చేసింది. కాగా గ్రూప్-1 జనరల్ ర్యాంకింగ్ లిస్టును రద్దు చేస్తూ గతంలో సింగిల్ జడ్జి తీర్పును వెలువరించారు. మెయిన్స్ జవాబు పత్రాలు పునర్ మూల్యాంకనం చేయాలని గతంలో పేర్కొన్నారు. సింగిల్ జడ్జి ఆదేశాలపై తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ), ఎంపికైన అభ్యర్థులు అప్పీల్ చేశారు. దీనిపై విచారణ చేపట్టిన సీజే ధర్మాసనం తాజాగా తీర్పును వెలువరించింది. గ్రూప్-1 ఉద్యోగాలకు ఎంపికైన 562 మందికి ఇప్పటికే ప్రభుత్వం నియామక పత్రాలను అందజేసిన విషయం విదితమే.

**ఇది జరిగింది :**

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) 2024 ఫిబ్రవరిలో గ్రూప్-1లో 563 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను జారీ చేసింది. 2024 అక్టోబరు 21వ తేదీ నుంచి 27 వరకు ప్రధాన పరీక్షలు(మెయిన్స్) నిర్వహించి మార్చి 30న ప్రధాన పరీక్షలో అన్ని పేపర్లకు హాజరైన 21,085 మంది అభ్యర్థుల మార్కులను టీజీపీఎస్సీ ప్రకటించింది. అర్హత పరీక్ష ఇంగ్లీష్‌తో పాటు ప్రధాన పరీక్షలైన ఆరు పేపర్ల మార్కులను వెల్లడించింది.అయితే టీజీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్‌లో జవాబు పత్రాల మూల్యాంకనం, ఎగ్జామ్ సెంటర్ల కేటాయింపులో అవకతవకలు, తెలుగు మాధ్యమంలో జవాబులు రాసిన వారికి అన్యాయం జరిగిందంటూ పలువురు అభ్యర్థులు కొద్ది రోజుల క్రితం హైకోర్టును ఆశ్రయించారు. పిటిషన్లపై జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు సుదీర్ఘ విచారణ చేపట్టి తీర్పును వెలువరించారు. ఆన్సర్ పేపర్లు దిద్దిన వారిలో ఎక్కువ మందికి తెలంగాణ చరిత్రపై అవగాహన లేదని, దానివల్ల మార్కుల కేటాయింపులో అన్యాయం జరిగిందని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు హైకోర్టులో వాదనలు వినిపించారు. సబ్జెక్ట్ నిపుణులతోనే జవాబు పత్రాల మూల్యాంకనం జరిగిందని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తరఫు న్యాయవాది న్యాయస్థానానికి తెలిపారు.

**సింగిల్ జడ్జీ తీర్పు :**

గ్రూప్1 అభ్యర్థుల పిటిషన్లపై విచారణ ముగిసిన తరువాత జవాబు పత్రాలు తిరిగి మూల్యాంకనం చేయాలని లేకుంటే మరోసారి పరీక్ష నిర్వహించాలంటూ హైకోర్టు సింగిల్ జడ్జి ధర్మాసనం కొద్ది రోజుల క్రితం తీర్పును వెలువరించింది. ఈ తీర్పుపై టీజీపీఎస్సీ అప్పీలు చేయగా సింగిల్ జడ్జి తీర్పు అమలును హైకోర్టు నిలిపివేసింది. దీంతో కమిషన్ తుది ఎంపికకు సంబంధించిన ఫలితాలను వెల్లడించింది.

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత గ్రూప్-1 పోస్టుల నియామకాలు చేపట్టడం ఇదే తొలిసారి. తుది ఎంపికలు హైకోర్టు తుది తీర్పునకు లోబడి ఉంటాయని టీజీపీఎస్సీ ప్రకటించింది. మెయిన్స్ జవాబు పత్రాలు మరోసారి మూల్యాంకనం చేయాలని హైకోర్టు సింగిల్ జడ్జి బెంచ్ ఇచ్చిన తీర్పుపై టీజీపీఎస్సీ, ఎంపికైన అభ్యర్థుల అప్పీల్ చేశారు. గతంలో విచారణ జరిపిన ధర్మాసనం తాజాగా తీర్పును వెలువరించింది. సింగిల్ జడ్జి బెంచ్ ఇచ్చిన తీర్పును కొట్టివేస్తూ తాజాగా ఆదేశాలు జారీచేసింది.

# పేద ప్రజల అభ్యున్నతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

- ఎమ్మెల్యే పులివర్తి నాని
- మీ ఊరికి.... మీ పులివర్తి నాని కార్యక్రమానికి విశేష స్పందన

**తిరుపతి, ఫిబ్రవరి 5 మనం న్యూస్ :** రాష్ట్రంలోని పేద ప్రజల అభ్యున్నతి, సంక్షేమం ప్రధాన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తున్నదని చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి వెంకట మణి ప్రసాద్ ( నాని) అన్నారు. గురువారం మండలంలోని సొరకాయల పాల్యం, వెంకట్రామాపురం, కేకేవీ పురం గ్రామపంచాయతీలలో రెండవ రోజు మీ ఊరికి.....మీ పులివర్తి నాని కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ.... ప్రజా సమస్యల పరిష్కరించి.... గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నానన్నారు.


ఏడాదిన్నర కాలంలో చంద్రగిరి నియోజకవర్గంలో ఎన్నడు లేని విధంగా అభివృద్ధి చేస్తూ..... చంద్రగిరిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతున్నానని పేర్కొన్నారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఎం తిరుమలరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే పులివర్తి నాని చొరవతో మండలంలోని రాయల చెరువు -అనుపల్లి, తిరుపతి కుప్పం బాదురు, పరమాల, గుండోడు కణం రహదారులను నిర్మించారన్నారు. ఎమ్మెల్యే పులివర్తి నాని నిరంతరం ప్రజా సంక్షేమం, అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్నారని కొనియాడారు. రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ ఎన్ చిన్న బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన హామీలు, సూపర్ సిక్స్ పథకాల ద్వారా నెరవేర్చిందన్నారు.

రైతుల, మహిళలు, బడుగు బలహీనవర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నదని తెలిపారు. ఎమ్మెల్యే పులివర్తి నాని ఏడాదిన్నర



పాలనలో అభివృద్ధిలో చంద్రగిరి నియోజకవర్గం ఐదేళ్లు ముందుకెళ్లిందని పేర్కొన్నారు. అనంతరం మీ ఊరికి.... మీ పులివర్తి నాని సమావేశంలో గ్రామాలలో సిమెంట్ రోడ్లు, స్మశానవాటికల అభివృద్ధి, ఇంటి పట్టాలు, పింఛన్ల మంజూరు కోసం ప్రజలు ఎమ్మెల్యే కి వినతి పత్రాలు అందజేశారు. పల్లెబాట కార్యక్రమానికి గ్రామాలలో ప్రజల నుండి విశేష స్పందన లభించింది. సమస్యల పరిష్కారానికి అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ యు మధుసూదన్ రావు, ఎంపీడీవో పులి రాంసింగ్, ఆర్డబ్ల్యూఎస్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉపేంద్ర రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ జనార్దన్ చౌదరి, ఈతమాకుల ఉమాపతి నాయుడు, పూజారి సుబ్రహ్మణ్యం యాదవ్, కాయం చంద్రశేఖర్ యాదవ్, నీలకంఠ చౌదరి, కే నరసింహారెడ్డి, ఆర్ గిరి నాయుడు, చంగయ్య యాదవ్, రాఘవేంద్ర నాయుడు, ముని కృష్ణయ్య, స్థానిక కూటమి నాయకులు, మండల స్థాయి అధికారులు, మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 7న శ్రీ కపిలేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



- ఫిబ్రవరి 8న ధ్వజారోహణం

**తిరుపతి, ఫిబ్రవరి 5, మనం న్యూస్ :** తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఫిబ్రవరి 7న సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 8 నుండి మార్చి 17వ తేదీ వరకు ఆలయంలో బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి.

అంకురార్పణం సందర్భంగా సాయంత్రం 4.30 నుండి 6.30 గంటల వరకు మూషిక వాహనంపై శ్రీ వినాయకస్వామివారు పురవీధుల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఆ తరువాత సాయంత్రం 6.30 నుండి రాత్రి 8.30 గంటల వరకు శాస్త్రోక్తంగా అంకురార్పణం నిర్వహిస్తారు.

**ఫిబ్రవరి 8న ధ్వజారోహణం**

ఫిబ్రవరి 8న ఉదయం 6.05 గంటలకు మకర లగ్నంలో ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. అనంతరం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు పల్లకీ ఉత్సవం, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు హంస వాహన సేవ జరుగనున్నాయి. ఈ సందర్భంగా ప్రతి రోజు ఉదయం 7 నుండి 9 గంటల వరకు, రాత్రి 7 నుండి 9 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు పురవీధుల్లో వాహన సేవలు నిర్వహిస్తారు.

## అక్రమంగా తరలిస్తున్న 6 ఎర్రచందనం దుంగలు స్వాఃధీనం

- ఎర్రచందనం దుంగలు కల కారు సీజ్
- ఇద్దరు స్మగ్లర్లు అరెస్టు

**తిరుపతి, ఫిబ్రవరి 5 మనం న్యూస్ :** శ్రీకాళహస్తి - పిచ్చాటూరు మార్గంలో కారులో ఎర్రచందనం దుంగలు తరలిస్తున్న ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేయడంతో పాటు, రవాణాకు ఉపయోగించిన కారును టాస్క్ ఫోర్సు పోలీసులు సీజ్ చేశారు. వీరి నుంచి ఆరు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్. సుబ్బారాయుడు కార్యాచరణ మేరకు టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ. శ్రీనివాస్ అధ్వర్యంలో ఏఎస్పీ జె. కులశేఖర్ పర్యవేక్షణలో, డీఎస్పీ ఎండీ షరీఫ్ మార్గనిర్దేశకత్వంలో ఆర్ఐ సాయి గిరిఃదర్ కు చెందిన ఏఆర్ఎస్ఐ ఈశ్వర్ రెడ్డి టీమ్, ఎఫ్ఆర్ఓ పి.సుభాష్ లు కేవీబీపురం మండలం వద్దకు చేరుకున్నారు. అక్కడ స్థానిక ఎఫ్బీఓ ఎం. సురేష్ కుమార్ తో కలసి మారప్పరెడ్డి కండ్రిగ చెక్ పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేపట్టారు. గురువారం ఉదయం అటువైపు వేగంగా వచ్చిన ఒక కారు, టాస్క్ ఫోర్సు పోలీసులను చూసి, కొద్ది దూరం ముందుగా ఆపేశారు. అందులో నుంచి ఇద్దరు




వ్యక్తులు దిగి పారిపోవడానికి ప్రయత్నించారు. అయితే టాస్క్ ఫోర్సు పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు. కారులో చూడగా అందులో ఆరు ఎర్రచందనం దుంగలు లభించాయి. పట్టుబడిన వారిని అరెస్టు చేసి విచారించగా, తిరుపతి జిల్లాకు చెందిన వ్యక్తులుగా గుర్తించారు. వారిని కారుతో సహా తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్ కు తరలించారు. వీరిని డీఎస్పీ వీ. శ్రీనివాస రెడ్డి, ఎసిఎఫ్ జె. శ్రీనివాస్ విచారించారు. సీఐ ఖాదర్ బాషా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# రోడ్డు ఆక్రమణలు తొలగించకుండా ట్రాఫిక్ నిబంధనలా..!

- ప్రజలను ఇబ్బందులకు గురించేసే ట్రాఫిక్ నిబంధనలు రద్దు చెయ్యాలి
- ఆర్టీసీ బస్సులను యధాతతంగా నడపాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు

**మదనపల్లె, ఫిబ్రవరి 5,మనం న్యూస్ :** మదనపల్లె పట్టణంలో రోడ్డు ఆక్రమణలు తొలగించి ట్రాఫిక్ సమస్య పరిష్కారం చేయాలని సిపిఎంతో సహా అన్ని సంఘాలు అడుగుతున్నా పట్టించుకోకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం సరైనది కాదని సిపిఎం అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు అన్నారు. గురువారం స్థానిక విలేకరులతో సిపిఎం నాయకులు నాగరాజు, నరసింహ లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే విపరీతమైన వాహన రద్దీ, ప్రజల రాకపోకలతో తీవ్రమైన ట్రాఫిక్ అంతరాయం




ఏర్పడి ప్రజలు అవస్థలు పడుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించడానికి రోడ్లు వెడల్పు చేసి, ట్రాఫిక్ సిగ్నల్లు రోడ్డు డివైడర్లు ఏర్పాటు చెయ్యడం ద్వారా సమస్యలు పరిష్కరిస్తారనుకుంటే, ట్రాఫిక్ సమస్యలు జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్ పి లకు కనిపించకుండా చెయ్యడం కోసం ప్రజలను ఇబ్బందులకు గురిచేయ్యటాన్ని తప్పు పట్టారు. పట్టణంలోని రోడ్లు పూర్తిగా ఆక్రమణకు గురైన ఫలితంగా ట్రాఫిక్ ఆటంకాలు తీవ్రంగా ఉన్నాయని చిన్న పిల్లలను అడిగినా చెబుతారు అలాంటిది అధికారులకు ఎందుకు కనబలేదని ప్రశ్నించారు. అధికారులు చేపట్టిన ట్రాఫిక్ నియంత్రణ చర్యలు వలన విద్యార్థులు, రైతులు, కూలీలు, ఉద్యోగులు,ఉపాధ్యాయులు, ఆసుపత్రులకు వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో ఉన్న రోడ్లు అన్నీ ఆక్రమణలు పాల్పడ్డారని, రోడ్డు ఆక్రమించుకోవడమే కాకుండా, వాళ్ళ బిల్డింగ్ల ముందు చిన్న తోపుడు బండ్లు, బంకులు పెట్టింది, వారి వద్ద వేల రూపాయలు బాడుగలు (అద్దెలు) వసూలు చేసుకొని దోపిడీకి పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ ట్రాఫిక్ కంట్రోల్ చేయడానికి వెనువెంటనే ఈ రోడ్ల ఆక్రమణలను తొలగించాలని డిమాండ్ చేశారు. పట్టణంలో ఉన్న వారపుసంతను టమాట మార్కెట్ యార్డుకు, మార్కెట్ యార్డును పట్టణ బయటకు తరలించాలని కోరారు. ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ అభివృద్ధి చెయ్యాలని, ఫుట్ పాత్ ఏర్పాటు చేయాలని, పట్టణంలోని ప్రజలు, వాహనదారులు అందరికీ ట్రాఫిక్ అవగాహన కల్పించాలని కోరారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రజలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలతో అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి సిపిఎం ఉద్యమం చేస్తుందని తెలిపారు.

# పదో తరగతి పరీక్షలకు సమర్థవంతమైన సన్నద్ధత అవసరం



- జీవీఎంసీ హైస్కూల్, కె.ఎన్.ఎం. గరల్స్ హైస్కూళ్ల సందర్శనలో జిల్లా కలెక్టర్

**విశాఖపట్నం, ఫిబ్రవరి 05 :** పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు సమగ్రంగా, ప్రణాళికాబద్ధంగా సన్నద్ధం కావాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం మధ్యాహ్నం రైల్వే న్యూ కాలనీ పరిధిలో ఉన్న జీవీఎంసీ హైస్కూల్, కె.ఎన్.ఎం. గరల్స్ హైస్కూళ్లను ఆయన సందర్శించి, పదో తరగతి విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు పరీక్షలకు ఎలా సిద్ధమవుతున్నారనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. రోజువారీ అధ్యయన విధానం, సిలబస్ కవరేజ్, ప్రిపరేషన్ ప్లాన్, స్లిప్ టెస్టుల నిర్వహణ, అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న 100 రోజుల యాక్షన్ ప్లాన్ పురోగతి గురించి ఉపాధ్యాయులు, విద్యార్థులను ప్రశ్నించారు. స్లిప్ టెస్టులు విద్యార్థుల బలాబలాలను గుర్తించేందుకు ఎంతో ఉపయోగపడతాయని, వాటి ద్వారా లోపాలను సరిదిద్దుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. 100 రోజుల యాక్షన్ ప్లాన్ను కచ్చితంగా అమలు చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులపై నిరంతరం పర్యవేక్షణ ఉంచి, వ్యక్తిగత శ్రద్ధ చూపాలని ఆదేశించారు. ఈ క్రమంలో విద్యార్థులతో సంభాషించిన ఆయన రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకొని క్రమశిక్షణతో అధ్యయనం చేయాలని, సందేహాలను వెంటనే నివృత్తి చేసుకోవాలని హితవు పలికారు. పదో తరగతి పరీక్షలు విద్యార్థుల భవిష్యత్తుకు కీలకమని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రోత్సహించారు. డీఈవో ఎన్. ప్రేమ్ కుమార్, ఉపాధ్యాయులు ఆయన వెంట ఉన్నారు.

## ఈ-ఆటోలను ప్రారంభించిన జిల్లా కలెక్టర్

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 5:** స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా పంపిణీ జరిగిన ఎనిమిది ఎలక్ట్రానిక్ వాహనాలను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పరిశుభ్రతను పాటించాలని, ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రధానమైన పారిశుభ్రతపై అధికారులు



మరియు సిబ్బంది బాధ్యత వహించి పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి భారతి సౌజన్యను ఏ ఏ మండలాలకు వాహనాలను కేటాయించారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కవిటి మండలం రాజపురం పంచాయతీ, కంచిలి మండలం ఎమ్ .య.స్. పల్లి, ఇచ్చాపురం మండలం మసకాపురం, వజ్రపు కొత్తూరు మండలం పల్లిఊరు, మందస మండలం బుడారిసింగి, పలాస మండలం తర్లకోటకు ఒక్కొక్కటి చొప్పున మరియు కోటబొమ్మాలి మండలం నిమ్మాడకు రెండు వాహనాలను కలిపి మొత్తం ఎనిమిది వాహనాలను మంజూరు అయినట్లు కలెక్టరుకు ఆమె వివరించారు. తదుపరి వాహనాల పరిశుభ్రతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, అనుభవం ఉన్న డ్రైవర్లుతో పని చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిపిఓ భారతి సౌజన్య, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 15 నుండి 18 వరకు శివరాత్రి మహోత్సవాలు

- దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు
- గత యేడాది కంటే ఈ యేడాది భక్తులు పెరిగే అవకాశం
- నరసన్నపేట శాసన సభ్యులు బగ్గు రమణమూర్తి

**శ్రీకాకుళం /శ్రీముఖలింగం, ఫిబ్రవరి,5:** మహా శివరాత్రికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగు ఏర్పాట్లు చేయాలని నరసన్నపేట నియోజకవర్గం శాసన సభ్యులు బగ్గు రమణమూర్తి వెల్లడించారు. గురువారం శ్రీముఖలింగేశ్వర స్వామి దేవస్థానంలో ఆయన అధ్యక్షతన ఆర్డీఓ సాయి ప్రత్యూషతో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15 నుండి 18వ తేదీ వరకు శ్రీముఖలింగేశ్వర స్వామి వారి దేవస్థానంలో శివరాత్రి మహోత్సవాలు జరుగుతాయన్నారు. దర్శనాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగు ఏర్పాట్లు చేయాలన్నారు. శ్రీముఖలింగం దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిందన్నారు. వేల సంవత్సరాల నుండి ఉత్సవాలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని చెప్పారు. నాలుగు రోజులు పాటు జరిగే యాత్రకు ఈ యేడాది 70 - 80 వేలు మంది భక్తులు వరకు వచ్చే అవకాశం ఉందని వివరించారు. దేవాలయాల్లో జరుగుతున్న సంఘటనలను దృష్టిలో పెట్టుకొని ఏర్పాట్లు చేయాలన్నారు. దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాల్సి ఉందన్నారు.

వచ్చిన భక్తుల భద్రత, క్యూలైన్లు, భక్తులకు ఇబ్బందులు లేకుండా తగు సూచనలు అందించాలన్నారు. మొబైల్ టాయిలెట్ ఏర్పాటు, స్నానాలు అనంతరం డ్రస్ ఛేంజింగ్ రూం ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. నిధులు సేకరణ, ప్రసాదాలు పంపిణీ, తదితర అంశాలపై చర్చించారు. శ్రీముఖలింగం ఊరుకి వెలుపల ఒక బెలూన్ ఏర్పాటు



చేయాలన్నారు. శానిటేషన్ పంచాయతీ అధికారులు చూసుకోవాలని చెప్పారు. అందరూ కలసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఆర్డీఓ కె. సాయి ప్రత్యూష మాట్లాడుతూ దర్శనాలకు వచ్చే భక్తులకు క్యూలైన్లు ఏర్పాటు చేయాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఎపిఈపీడిసియల్ విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, వైద్య ఆరోగ్య శాఖ తరఫున వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని మెడికల్ ఆఫీసర్ సుజాత వివరించారు. అగ్నిమాపక శాఖ ఏర్పాట్లు, పార్కింగ్ పై రవాణా శాఖ అధికారులు వివరించారు. ఆర్డబ్ల్యుఎస్ తాగునీరు సరఫరా చేయాలని ఆదేశించారు. వంశధార నదిలో చక్ర స్నానాలకు తగు నీరు విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, సైనేజ్ బోర్డులు, తదితర ఏర్పాట్లు పై చర్చించారు. అనంతరం ఆలయ పరిసరాలను, ఆలయం లోపలి భాగాన్ని పరిశీలించారు.

డిఎస్పీ లక్ష్మణరావు మాట్లాడుతూ దేవాలయాల వద్ద జరిగిన గత సంఘటనలను దృష్టిలో పెట్టుకుని తగు ఏర్పాట్లు చేయాలన్నారు. మన ఇంట్లో కార్యక్రమంలా అందరూ భావించి తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఆలయ అర్చకులు శివాజీ మాట్లాడుతూ భక్తులు దర్శనాలు, చక్ర స్నానాలు పై తెలియజేశారు.

ఈ సమావేశంలో దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్ పట్నాయక్, ఆలయ ఛైర్మన్ శివప్రసాద్ పాడి, డిఎస్ఓ సూర్య ప్రకాష్, తహసీల్దార్ రామారావు, ఎంపిడిఓ వి. చిన్నమ్మడు, ఆర్ అండ్ బి ఈఈ తిరుపతిరావు, గ్రామ సర్పంచ్ సతీష్ కుమార్, ఆలయ ఈఓ ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

## చెట్టు కన్నీరొలికింది...!

జనాల మధ్యన వుండటానికి
చెట్టు ఎందుకో భయపడుతోంది
కొమ్మ చాటు సేద తీరే మనిషిలో
రెమ్మల్ని తుంచే ఆలోచన
బుసలు కొడుతూ లేస్తుంటే
చెట్టు గుండె గుభేలుమంటోంది

వనాల్ని తరిగి జనాలు పోగైతుంటే
ప్రకృతి వికృతితో విలవిలబోతుంటే
వృక్షం భవిష్యత్తు ఊహించుకుని
నీరు తాగడం మానేసి కూర్చుంది
పోషించాల్సిన చేతులు కాటేస్తూ
విషాన్ని చిమ్మి చంపేస్తూ వెళ్తుంటే
చెట్టు కన్నీటి పర్యంతమైంది

ఊపిరి పోసే చెట్టును కాదనుకుని
కృత్రిమ శ్వాసతో మనిషి బ్రతుకు
బలవంతాన సాగిపోతుంటే
చెట్టు హృదయం ద్రవించింది
మొక్క వుండాల్సిన ఇంటి ముందు
కుక్కను పెంచుతూ ఆనందిస్తుంటే
వృక్ష జాతి ఫక్కున నవ్వుకుంది

ఎడారి ప్రాంతంలో తడారిపోతూ
ఎండు పుల్లల్లాంటి జీవనాల్ని చూసి
చెట్టుకు చింత ఆకాశమంతైంది
చెట్లు కరువైన ఊరి పొలిమేర
ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతుంటే
ఆ ప్రాంతం నోటిపైన వేలేసుకుంది
చెట్టు లేని చోటు చేటు కదరా అని
ఒక్కరైనా చెప్పకపోతారా అని
చెట్టు చెవుల్ని రిక్కించి కాచుంది

**- నరెద్దుల రాజారెడ్డి**
9666016636

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.**
**- ఎడిటర్**

# ఋతుక్రమ విద్యపై కొత్త ఆశలు



భారత అత్యున్నత న్యాయస్థానం ఋతుక్రమ ఆరోగ్యాన్ని ఒక ప్రాథమిక హక్కుగా ప్రకటించి, దేశ వ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో ఉచిత శానిటరీ సౌకర్యాలను కల్పించాలని ఆదేశించినప్పుడు, అది కేవలం ఒక సాధారణ తీర్పుగా మాత్రమే మిగిలిపోలేదు. దశాబ్దాలుగా సామాజిక వివక్షకు గురవుతున్న కోట్లాది మంది పౌరుల పట్ల జరుగుతున్న ఒక దీర్ఘకాలిక అన్యాయాన్ని సరిదిద్దే దిశగా ఇది ఒక నైతిక హెచ్చరికగా నిలిచింది. చాలా కాలంగా మన సమాజంలో ఋతుక్రమం అనేది కేవలం ఒక వ్యక్తిగత ఇబ్బందిగా, రహస్యంగా ఉంచాల్సిన అపరాధంగా, లేదా పారిశుద్ధ్యానికి సంబంధించిన అంశంగా మాత్రమే పరిగణించబడింది. కొన్ని సందర్భాల్లో ఇది కేవలం దానధర్మంగా లేదా సేవా కార్యక్రమంగా చూడబడింది. కానీ, ఈ చారిత్రాత్మక తీర్పు ద్వారా రాజ్యాంగంలోని 21వ అధికరణం కింద ప్రతి వ్యక్తికి లభించే గౌరవం, శారీరక స్వయంప్రతిపత్తి, సమాన అవకాశాలకు సంబంధించిన ప్రాథమిక హక్కు అని స్పష్టమైంది. ఈ చట్టపరమైన గుర్తింపు ఎంత గొప్పదైనప్పటికీ, అసలైన పరీక్ష ఈ తీర్పును సామాన్య ప్రజల దైనందిన జీవితాల్లో వాస్తవిక మార్పుగా మార్చడంలోనే దాగి ఉంది.

భారతదేశం వంటి విశాలమైన దేశంలో ఋతుక్రమం అనేది వందల మిలియన్ల మంది జీవితాలను ప్రభావితం చేసే అంశం. గణాంకాలను పరిశీలిస్తే, మన దేశంలో సుమారు 39.3 కోట్ల మంది ఋతుక్రమం పొందే వ్యక్తులు ఉన్నారు. ఇంత భారీ సంఖ్యలో ఉన్న పౌరుల అవసరాలను తీర్చాలంటే మన ప్రభుత్వ విధానాలు కేవలం తాత్కాలిక ఉపశమనాన్ని ఇచ్చేవిగా ఉండకూడదు. అవి హక్కుల ఆధారితమైనవిగా, వ్యవస్థాగతమైనవిగా మరియు సమాజంలోని అన్ని వర్గాలను కలుపుకుపోయేలా ఉండాలి. ఆచరణలో ఈ తీర్పు విజయవంతం కావాలంటే మొదటగా మన సరఫరా వ్యవస్థలో సమూల మార్పులు రావాలి. ప్రస్తుతం పాఠశాలల్లో శానిటరీ ప్యాడ్‌ల సరఫరా చాలా తక్కువగా ఉంది. కేవలం ప్యాడ్‌లు అందించడమే కాకుండా, పునర్వినియోగపరచదగిన మరియు పర్యావరణానికి తక్కువ హాని చేసే ఎంపికలను కూడా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. ఇటువంటి ఉత్పత్తులను తయారు చేసే చిన్న చిన్న సంస్థలకు మరియు స్టార్టప్‌లకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహకాలు అందించాలి, తద్వారా గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో అందరికీ ఇవి సరసమైన ధరలకే లభిస్తాయి.



ఋతుక్రమ ఆరోగ్యాన్ని కేవలం పారిశుద్ధ్యం అనే ఒక చిన్న పరిధిలో బంధించకూడదు. ఇది ఆరోగ్య వ్యవస్థలు, విద్యా విధానం, కార్మిక చట్టాలు మరియు విపత్తు నిర్వహణ ప్రణాళికల్లో అంతర్భాగం కావాలి. కేవలం ఒకే మంత్రిత్వ శాఖపై భారం వేయకుండా కార్మిక, ఆరోగ్య మరియు విద్యా శాఖల మధ్య పటిష్టమైన సమన్వయం ఏర్పడాలి. తద్వారా క్షేత్రస్థాయిలో అమలును పర్యవేక్షించవచ్చు. దీనికి తోడు, ఋతుక్రమ సంబంధిత రుగ్మతలను గుర్తించడం మరియు వాటికి చికిత్స అందించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యతగా మారాలి. ముఖ్యంగా పిసిఓఎస్ (PCOS), ఎండోమెట్రియోసిస్ వంటి తీవ్రమైన సమస్యల గురించి అవగాహన కల్పించి, ఆరోగ్య కేంద్రాల ద్వారా తగిన సేవలు అందించాలి.

విద్య పరంగా చూస్తే, ఈ అవగాహన అనేది చిన్న వయస్సు నుంచే ప్రారంభం కావాలి. కనీసం ఏడు నుండి ఎనిమిది ఏళ్ల వయస్సు నుంచే బాల బాలికలకు పాఠశాలల్లో ఋతుక్రమ విద్యను బోధించాలి. దీనివల్ల బాలికలు తమ మొదటి ఋతుక్రమం సమయంలో భయాందోళనలకు గురికాకుండా ఉంటారు. బాలురను కూడా ఈ అవగాహనలో భాగస్వాములను చేయడం ద్వారా సమాజంలో నెలకొన్న సిగ్గు బిడియం మరియు సామాజిక వివక్షను సమూలంగా తొలగించవచ్చు. కేవలం ఉత్పత్తులను అమ్ముకోవడం కోసం చేసే ప్రకటనల కంటే, ప్రవర్తనా మార్పు తీసుకు వచ్చే వ్యూహాలను రూపొందించడం అత్యవసరం.

మరో ముఖ్యమైన అంశం ఏమిటంటే సమ్మిళితత్వం. ఋతుక్రమం పొందే వారందరినీ ఒకే కోణంలో చూడటం సరికాదు. పారిశుద్ధ్య కార్మికులు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్‌లు, నాన్-బైనరీ వ్యక్తులు మరియు మెనోపాజ్ దశకు చేరుకున్న కార్మికులు-వీరందరికీ భిన్నమైన అవసరాలు ఉంటాయి. ప్రభుత్వం సేకరించే ఏ డేటా అయినా వైకల్యం, కులం మరియు లింగ గుర్తింపు ఆధారంగా విభజించబడి ఉండాలి. అప్పుడే ప్రతి వర్గానికి సరైన న్యాయం జరుగుతుంది. విపత్తుల సమయంలో, అంటే వరదలు వచ్చినప్పుడు లేదా తీవ్రమైన నీటి కొరత ఉన్నప్పుడు, ఋతుక్రమ అవసరాలు అస్సలు పట్టించుకోబడవు. ఇటువంటి అత్యవసర సమయాల్లో కూడా ఋతుక్రమ ఆరోగ్య అవసరాలను విపత్తు నిర్వహణ ప్రణాళికలో ఒక ప్రాధాన్యత అంశంగా గుర్తించాలి. ఈ మార్పులన్నీ జరగాలంటే పీరియడ్స్ సమస్యను కేవలం 'దానధర్మం' తో పరిష్కరించలేము. దీనికి పటిష్టమైన ప్రజా ఆరోగ్య వ్యవస్థలు, శిక్షణ పొందిన నిపుణులు మరియు చట్టబద్ధమైన హక్కులు అవసరం.

కోర్టు ఇచ్చిన ఈ చారిత్రాత్మక తీర్పు కేవలం ఒక ఆశగా మిగిలిపోకూడదు. పార్లమెంటు దీనిని అమలు చేయదగిన చట్టంగా మార్చాలి. శానిటరీ మౌలిక సదుపాయాలు, నిధుల కేటాయింపు మరియు వివిధ శాఖల జవాబుదారీతనం ఉండేలా చూడాలి. ఋతుక్రమ ఆరోగ్యం అనేది పౌరులు అడుక్కోవాల్సిన దానధర్మం కాదు, అది వారు గర్వంగా క్లెయిమ్ చేయగల హక్కుగా మారాలి. ఋతుక్రమాన్ని గౌరవంగా చూసే, నొప్పికి సరైన చికిత్స లభించే, మరియు ప్రతి పౌరుడి శారీరక స్వయంప్రతిపత్తిని ప్రభుత్వం కాపాడే కొత్త అధ్యాయాన్ని మనం మొదలుపెట్టాలి. అది మనం పౌర సమాజానికి నిలబెట్టుకోవాల్సిన వాగ్దానం. గౌరవప్రదమైన ఋతుక్రమ ఆరోగ్యం అనేది కేవలం ఒక వ్యక్తిగత విషయం కాదు, అది ఒక దేశ గౌరవానికి చిహ్నం. అందుకే ఈ ప్రయాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. న్యాయస్థానం చూపిన మార్గంలో పయనిస్తూ, వివక్ష లేని సమాజాన్ని నిర్మించడమే మన ముందున్న అసలైన లక్ష్యం.

**- వెంక గారి భూమయ్య**
9848559863

# అంబేద్కర్‌కు అండగా సాయాజీ



భారతదేశ చరిత్రలో రాజులెందరో పుట్టారు.. కానీ ప్రజల కోసం రాజ్యాన్ని ఒక సాధనంగా మార్చుకున్నవారు చాలా అరుదు. అలాంటి అరుదైన మహానేతల్లో మొదటి వ్యక్తి సాహూమహారాజ్, ఆ తర్వాత సాయాజీ రావ్ గైక్వాడ్-3 అగ్రస్థానంలో నిలుస్తారు. సాయాజీ రావ్ గైక్వాడ్-3 బరోడా సంస్థానాన్ని పాలించాడు. అతడు అణగారిన వర్గాల ఆశాకిరణం, సామాజిక విప్లవానికి దారి చూపిన దిక్సూచి.

విద్యనే ఆయుధంగా మార్చిన దూరదృష్టి గల పాలకుడు. ఆ కాలంలో సమాజం కులగోడలతో నలిగిపోతున్నప్పుడు, విద్య కొద్దిమందికే పరిమితమైనప్పుడు, విద్య హక్కు అది దానం కాదు!అని ధైర్యంగా ప్రకటించాడు. ఆయన రాజ్యమే విద్యా రాజధానిగా మారింది. 1906లోనే ప్రాథమిక విద్యను ఉచితంగా, తప్పనిసరిగా అమలు చేసిన రాజ్యం బరోడా. ఇది బ్రిటిష్ భారత దేశంలోనే అత్యంత విప్లవాత్మక నిర్ణయం. నేడు రాజ్యాంగం ద్వారా అమలవుతున్న విద్య హక్కు చట్టాన్ని ఆనాడే కార్యరూపం దాల్చిందంటే, సాయాజీ రావ్ గైక్వాడ్-3 దళితులు, వెనుకబడిన వర్గాలకు విద్య, ఉద్యోగాల్లో అవకాశాలు, స్కాలర్షిప్లు, విదేశీ విద్యకు ఆర్థిక సహాయం అందించి సామాజిక న్యాయ పాలన దిశగా అడుగులు వేశాడు. మహిళల విద్య, వితంతు వివాహాలు వంటి సామాజిక సంస్కరణలకు మద్దతు పలికాడు. అణగారిన వర్గాలకు విద్యలో రిజర్వేషన్లు అమలు చేసిన తొలి పాలకుల్లో ఆయన ఒకరు. అందుకే ఆయన్ని సామాజిక న్యాయానికి తొలి శిల్పి అంటారు. డా. బాబాసాహెబ్ అంబేద్కర్ చదువుకు ఆర్థిక సహాయం అందించిన రాజు. ఈ సందర్భంగా దేశంలో వెనుకబడిన వర్గాలకు, దళితులకు మధ్య చారిత్రక అనుబంధం గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉంది. సాహు మహారాజ్, సాహుజి రావ్ గైక్వాడ్ వంటి రాజుల ప్రోద్బలంతోనే వెనుకబడిన వర్గాలకు చెందిన...భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ బయటకు వచ్చాడు. జ్యోతిరావ్ పూలేను అంబేద్కర్ గురువుగా ప్రకటించుకొని సామాజిక ఉద్యమాలు చేశాడు. ఆ మహనీయుల స్ఫూర్తితో బీహార్, ఉత్తర ప్రదేశ్, జార్ఖండ్, తమిళనాడు రాష్ట్రాలలో బీసీ, ఎస్సీ, ఎస్టీలు కలిసి రాజ్యాధికారంలోకి వచ్చారు. కావున నేడు బహుజనుల చారిత్రక అనుబంధం అవసరం.

సాయాజీ రావ్ గైక్వాడ్-3 జీవితం మనకు ఒక స్పష్టమైన సందేశం ఇస్తుంది. రాజ్యం అంటే భోగం కాదు బాధ్యత. పాలన అంటే అధికారం కాదు సేవ అని చెప్పిన గొప్ప రాజు. ఆ మహా నేత ఫిబ్రవరి 6న తుది శ్వాస విడిచాడు. నేడు ప్రజాస్వామ్య దేశంలో దళిత బహుజనులు రాజ్యాంగ హక్కులకు దూరంగా ఉన్నారు. జనాభా దామాషా ప్రకారం విద్య, ఉద్యోగ, రాజకీయాలు అవకాశాలు అందడం లేదు. ప్రజల సంక్షేమం నుంచి ప్రభుత్వం తప్పుకుంటుంది. సామాజిక ఆర్థిక అంతరాలు పెచ్చురిల్లుతున్నాయి. ప్రవేటీకరణతో ప్రభుత్వ విద్య, ఆరోగ్య వ్యవస్థలు నిర్వీర్యం అవుతున్నాయి. పేద విద్యార్థులకు సమయానికి స్కాలర్షిప్‌లు విడుదల కాకపోవడం, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు నిలిచిపోవడంతో చదువు మధ్యలోనే మానేయాల్సిన పరిస్థితికి నెట్టుతున్నాయి. విద్య సంస్థల్లో కుల వివక్షత విజృంభిస్తుంది. ఇది హాస్టళ్లలో, తరగతుల్లోకి వెళ్లింది. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ బడుగుల రిజర్వేషన్ వ్యవస్థకు గండి కొడుతున్నారు. వీటన్నిటికీ దళిత, బహుజన విద్యార్థులే బలవుతున్నారు. ఈ నేపథ్యంలో సాయాజీ రావ్ గైక్వాడ్-3 చేసిన సామాజిక సంస్కరణలు, రాజ్యాంగ ఆదేశాలు అత్యవసరం. విద్య కోసం సాహు మహారాజ్, సాహుజి రావ్ గైక్వాడ్‌ల అండతోనే భారత దేశ రాజ్యాంగ రూపశిల్పి అంబేద్కర్ ఆవిర్భవించాడు. ఆయన ఉద్యమ కొనసాగింపుగా కాన్షిరామ్ బహుజన రాజ్యాధికారాన్ని సాకారం చేశాడు. బీసీ ఎస్సీ ఎస్టీల ఉమ్మడిగా ఉద్యమించి రాజ్యాధికారం వైపు ప్రయాణించాలి. ఇదే సాయాజీ రావ్ గైక్వాడ్-3 కు ఇచ్చే ఘనమైన నివాళి.




**సాయాజీ రావ్‌గైక్వాడ్-3 వర్ధంతి.(ఫిబ్రవరి 6)**
**- సంపతి రమేష్ మహారాజ్**
7989579428.

# మహిళల్లో గుండె జబ్బులు



గుండె జబ్బులు అనగా గుండె, రక్తనాళాల వ్యవస్థలను ప్రతికూల ప్రభావితం చేసే ఏ వ్యాధిగా గుర్తించాలి. గుండె పోటు, స్ట్రోక్, కరోనరీ హార్ట్ డిసీజ్, అధిక రక్తపోటు లాంటి సమస్యలు మహిళల వయస్సు పెరిగిన కొద్దీ పెరుగుతున్నాయి. ముఖ్యంగా మెనోపాజ్ తర్వాత ఈ సమస్యలు పెరుగుతున్నాయి. పురుషుల కంటే మహిళల్లో హృదయ నాళ సంబంధ సమస్యలు, మరణాలు అధికంగా నమోదు అవుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా మహిళల్లో గుండె జబ్బుల సమస్యలు ప్రాణాంతకంగా మారుతున్నాయి. ప్రతి ముగ్గురు మహిళల మరణాల్లో ఒక్కరు గుండె జబ్బులతో జరుగుతున్నట్లు అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. క్యాన్సర్ కన్నా గుండె జబ్బులతో మహిళలు అధికంగా ప్రాణాలు కోల్పోతూ ఉన్నారు. పురుషులతో పోల్చితే మహిళల్లో గుండె జబ్బులు అధికంగా నమోదు అవుతున్నాయి. ఇలాంటి అత్యంత ప్రమాదకర వ్యాధుల పట్ల మహిళల్లో అవగాహన పెంచడానికి ప్రతి ఏట ఫిబ్రవరి తొలి శుక్రవారం, అనగా 06 ఫిబ్రవరి 2026 రోజున జాతీయ మహిళా గుండె దినోత్సవం లేదా నేషనల్ వుమెన్ హార్ట్ డే లేదా నేషనల్ వియర్ రెడ్ డే పాటించడం జరుగుతుంది.



రుతు విరతి లేదా మెనోపాజ్ తర్వాత మహిళల్లో గుండె జబ్బులు పెరుగుతున్నాయి. మహిళల్లో గుండె జబ్బుల లక్షణాలుగా శ్వాస ఆడకపోవడం, క్రమరహిత హృదయ స్పందన, చెమట పట్టడం, తల తిరగడం, ఛాతి/మెడ/వెన్ను/భుజాల/దవడ/తల నొప్పులు, వికారం, మైకం, అజీర్ణం, అలసట, వాంతులు లాంటి రోగ లక్షణాలు కనిపిస్తాయి.

చిన్న గుండె ధమనుల్లో ఉత్పన్నమయ్యే సమస్యల వల్ల కరోనరీ మైక్రోవాస్కులార్ డిసీజెస్ బయట పడుతున్నాయి. తీవ్ర మైన భావోద్వేగ ఒత్తిడి వల్ల గుండె బలహీనపడడంతో మహిళల్లో అధికంగా బ్రోకెన్ హార్ట్ సిండ్రోమ్ సమస్యలు వస్తున్నాయి. మెనోపాజ్ తర్వాత ఈస్ట్రోజెన్ హార్మోన్ తగ్గుదల వల్ల గుండె జబ్బుల సమస్యలు పెరుగుతున్నాయి.

**మహిళల్లో గుండె జబ్బులకు కారణాలు**

పురుషులతో పోల్చితే మహిళల్లో మధుమేహ ప్రభావం అధికంగా కనిపిస్తున్నది. అధిక కొలెస్ట్రాల్ (ఎల్డిఎల్), అధిక రక్త పోటు కూడా మహిళల్లో గుండె జబ్బులకు ఊతం ఇస్తున్నాయి. ధూమపాన/ఆల్కహాల్ దురలవాటు, శారీరక శ్రమ కొరవడడం, ఊబకాయ సమస్యలు కూడా మహిళలకు శాపంగా మారుతున్నాయి. మహిళల్లో మానసిక ఒత్తిడి, చిన్న చిన్న సమస్యలకు కుంగిపోవడం వల్ల కూడా గుండె జబ్బులు పెరుగుతున్నట్లు తేలింది.

**మహిళల్లో గుండె జబ్బుల నివారణ, తీసుకోవలసిన జాగ్రత్తలు**

మన కుటుంబాల్లో మహిళలు అందరికీ ఆహారం వడ్డించినా తర్వాత మిగిలిన ఆహార పదార్థాలను మాత్రమే తినడంతో వారిలో పోషకాహారలోపాలు కనిపిస్తున్నాయి. అందు వల్ల మహిళలు కూడా మంచి పోషకాహారం తీసుకునే విధంగా పురుషాధిక్య సమాజం జాగ్రత్తలు తీసుకోవాలి. మహిళలు విధిగా పండ్లు, కూర గాయలు, తక్కువ కొవ్వులు ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవాలి. ప్రతి రోజు తప్పకుండా కనీసం 30 నిమిషాలు శారీరక వ్యాయామం చేయాలి. ధూమపాన దురలవాటుకు దూరంగా ఉండాలి. రక్తపోటు, షుగర్, కొలెస్ట్రాల్, బిపీ లాంటి వైద్య పరీక్షలకు ప్రతి ఏట చేయించుకొని నిపుణులైన వైద్యుల సూచనలు పాటించాలి. ముఖ్యం గా 50 - 55 ఏండ్లకు పైబడిన మహి ళలు ఎల్లవేళల అప్రమత్తంగా ఉండాలి. మహిళలు తమ శరీర బరువును అదుపులో ఉంచుకోవాలి.

గుండె జబ్బులు మహిళలకు ప్రధాన ఆరోగ్య సమస్యగా మారుతున్న వేళ రోగ లక్షణాలను గమనిస్తూ, పోషకాహారం తీసుకుంటూ, తగు ముందు జాగ్రత్తలు పాటిస్తూ, తరుచుగా వైద్య పరీక్షలు చేయించుకుంటూ ఆరోగ్యకరమైన హృదయంతో ఆనందంగా జీవితాలను కొన సాగించాలి. గుండె జబ్బుల బారిన పడిన మహి ళలు తమ కుటుంబ సభ్యులను అనాథలుగా మార్చ వద్దని కోరుకుందాం. మహిళల ఆరోగ్యమే కుటుంబ శ్రేయస్సు, సౌభాగ్యానికి పునాది అని మరువరాదు. జాతీయ మహిళా హృదయ దినోత్సవం రోజున ఎరుపు రంగు రిబ్బన్లు, డ్రస్సులు ధరించి మహిళా లోకానికి సంఘీభావాన్ని ప్రదర్శిస్తూ, వారు గుండె జబ్బుల బారిన పడకుండా అడ్డుకుందాం.

**ఫిబ్రవరి 6 జాతీయ మహిళా గుండె జబ్బుల వ్యతిరేక దినోత్సవం**
**- డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

# నకిలీ ఆదివాసీ నాయకత్వం



ఏజెన్సీలో ఆదివాసీ సంఘాలు నాయకులు అంటూ ఆదివాసీ సమాజాన్ని నిలువు నా మోసం చేస్తూ ఆదివాసీ ఉద్యమాన్ని ఒక ఉపాధిగా చేసుకొని జీవనం సాగిస్తున్న నకిలీ ఆదివాసీ సంఘాలు రోజురోజుకు పుట్టగొడుగుల్లాగా పుట్టుకొని వస్తున్నాయి. నకిలీ ఆదివాసీ సంఘాలు ఏజెన్సీలో స్వరవిహారం చేస్తూ ఆదివాసీ సమాజం ఆత్మ గౌరవాన్ని దెబ్బ తీస్తున్నాయి. విప్లవ పార్టీలుకు సద్దులు మోస్తూ సంచులు మోస్తూ బూర్జువా పార్టీల బూట్లు నాకుతూ బ్యాంక్ బ్యాలెన్స్ పెంచుకుంటున్న పరిస్థితి నేడు ఏజెన్సీలో ఉన్నది.

ఎలక్షన్ వస్తే చాలు ఆదివాసీ సంఘాలు నాయకుల దొంగల ముఠా మొత్తం ఒక్కసారిగా ఆదివాసీ సంఘాలు ఇంటి ముందు వాలుతుంది. కారణం స్పష్టం - అక్కడ ఓట్ల కాసుల మూట ఉంటుంది. ఆదివాసీ ఓట్లు, ఆదివాసీ చావులు, ఆదివాసీ బాధలు అన్నీ రాజకీయ మార్కెట్లో అమ్ముకునే సరుకులుగా మారిపోయాయి. ఇక్కడ చూడాల్సింది ఆదివాసీ కన్నీళ్లు కాదు కాసుల మూట ఎంత పెద్దదన్నదే.

ఆదివాసీ నాయకులమని చెప్పుకుంటూ తిరిగే కొందరు, ఆదివాసీల పై దౌర్జన్యాలు జరిగితే మేమున్నాం అంటూ మీడియా కెమెరాల ముందు గొంతెతుతారు. ఫోటోలు, వీడియోలు అయ్యాక వెనక నుంచి బాధిత కుటుంబాల బాధను బేరంగా మార్చుకుని జేబులు నింపుకుని వెళ్లిపోతారు. ఇలాంటి నకిలీ ఆదివాసీ నాయకులే నేటి ఆదివాసీ సమాజానికి అసలైన శాపం.

ఆదివాసీ హక్కులు తుంగలో తొక్కబడుతున్నా, ఆదివాసీ ప్రాణాలు కోల్పోతున్నా న్యాయం కోసం పోరాడాల్సిన చోట రాజకీయ లాభాలు, డబ్బు వసూలే కొంత మంది ఆదివాసీ లీడర్ల ప్రధాన వృత్తిగా మారింది. ఆదివాసీ ల కన్నీళ్లపై రాజకీయ వ్యాపారం చేస్తున్న ఈ స్వార్థ ఆదివాసీ నాయకులు ఉన్నంతకాలం ఆదివాసీ సమాజానికి న్యాయం జరగడం ఒక కలగానే మిగిలిపోతుంది.



గిరిజనేతరుల మోచేతి నీళ్లు తాగడం అలవాటై, అధికారాల చుట్టూ తిరుగుతూ స్వప్రయోజనాల కోసం ఆస్తులు కూడబెట్టుకునే ఈ నాయకులు ఆదివాసీ సమాజాన్ని ముందుకు నడిపించడం కాదు, మరింత వెనక్కి నెట్టేస్తున్నారు. నేటి ఈ స్వార్థ ఆదివాసీ నాయకత్వం కొనసాగితే రేపటి తరాల ఆదివాసీ పిల్లలకు కూడా అవమానాలే వారసత్వంగా మిగిలే ప్రమాదం ఉంది.

ఆదివాసీ పేరుతో రాజకీయాలు చేసి, ఆదివాసీ జీవితాలతో వ్యాపారం చేస్తున్న ఆదివాసీ నాయకులకు ఇప్పటికైనా కనువిప్పు కలగాలి. నకిలీ నాయకత్వం అంతం చేసి, నిజమైన ఆదివాసీ నాయకత్వం వెలుగులోకి రావాలి. అదే ఆదివాసీ సమాజ భవిష్యత్తుకు ఏకైక ఆశ.

**- వూకె రామకృష్ణ**

## బలవంతపు చావు

అనాలోచితం శీఘ్రనిర్ణయం
ఉచితానుచితాలను మరిపింపచేయడం
జరిగే ఘోరానికి జవాబుదారీ ఎవ్వరిది?
విధితో పోరాడలేని పిరికివారు
తామే కాకుండా పరివారాన్నీ ముంచిన
మరణోన్మాదం మతిలేని నిర్ణయం.
నిదానిస్తే సమస్యలకు సమాధానాలు లభిస్తాయి.
తొందరపాటు నిర్ణయాలు
అమానవీయం కాదా!
ఈ సమాజం ఎటు పయనిస్తోంది?
కధనాలు తరచుగా జరుగుతున్నా
స్పందించరా!
ఆత్మహత్యలకు కారణాలెలా విశ్లేషించాలి?
నెమ్మదిగా ఆలోచిస్తే బలవన్మరణాలు,ఆందోళనలు తగ్గుతాయి
అవమానమా?అసమానతా,అసహనమా?
తీవ్రవత్తిడికి తట్టుకోలేకపోతున్నారా?
తప్పులే మహాపాపంగా
వెంటాడుతున్నాయా?
ఆత్మహత్యలు ఆగేదెన్నడు?
ఈ సామాజికసమస్యకు
మేధావులేమంటారు?మనస్తత్వవేత్తలేమంటారు?
మనసు విరిగితే మందే లేదా?
కౌన్సిలింగ్ తో సరిచేయలేమా?
కనువిప్పు కలగదా? ఆలోచించండి.

**- వేమూరి శ్రీనివాస్**
9912128967

# కోనసీమలో 'పర్ర' పోరు

- కలెక్టరేట్ వద్ద రైతుల కధనరంగం
- ఆపరేషన్ పర్ర'కు డిమాండ్




**కాట్రేనికోన, ఫిబ్రవరి 5,మనం ప్రతినిధిః** అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 'పర్ర' (స్వాంప్) భూముల పరిరక్షణ కోరుతూ రైతులు కదం తొక్కారు. సముద్ర తీరప్రాంతాల్లోని పర్ర భూములను ఆక్రమించి అక్రమంగా ఆక్వా చెరువులు తవ్వుతున్నారని ఆరోపిస్తూ, వివిధ రైతు సంఘాల ఆధ్వర్యంలో అమలాపురం కలెక్టరేట్ ఎదుట భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. సుమారు 2,000 ఎకరాల స్వాంప్ భూములను కొందరు ఆక్రమించి రొయ్యల చెరువులుగా మార్చేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కూనవరం, రామేశ్వరం మొగ ప్రాంతాల్లో సీఆర్జెడ్ నిబంధనలను తుంగలో తొక్కి ఈ అక్రమ సాగు యథేచ్ఛగా సాగుతోందని ఆరోపించారు. ఈ అక్రమ ఆక్వా చెరువుల కారణంగా ఉప్పునీరు వ్యవసాయ భూముల్లోకి చొరబడి, సారవంతమైన నేలలు నిస్సారమవుతున్నాయని తెలిపారు. ఎండిపోతున్న కొబ్బరి చెట్లు: ఉప్పునీటి ప్రభావంతో కోనసీమ ప్రధాన పంటలైన వరి సాగు ప్రశ్నార్థకంగా మారిందని, ఇప్పటికే లక్షలాది కొబ్బరి చెట్లు ఎండిపోతున్నాయని రైతులు వాపోయారు. తక్షణం చర్యలు తీసుకోకపోతే కోనసీమ వ్యవసాయం పూర్తిగా నాశనమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ' గతంలో కొల్లేరు సరస్సును రక్షించడానికి ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ కొల్లేరు' స్ఫూర్తితో, ఇప్పుడు కోనసీమను కాపాడేందుకు 'ఆపరేషన్ పర్ర' నిర్వహించాలని రైతు సంఘాలు డిమాండ్ చేశాయి. అక్రమ ఆక్రమణదారుల జాబితాను త్వరలోనే బహిర్గతం చేస్తామని రైతు రక్షణ సమితి నేతలు స్పష్టం చేశారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రజాప్రతినిధులు ఈ సమస్యపై గళం విప్పాలని వారు కోరారు. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, మట్టా మహాలక్ష్మి ప్రభాకర్, కల్వకొలను తాతాజీ, మహాదశ నాగేశ్వరరావు, అయితాబత్తుల వెంకట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి ఉత్సవాలలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

- సమీక్ష సమావేశం తీర్మానం

**పాలకొల్లు, ఫిబ్రవరి 5,మనం ప్రతినిధిః** పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు పట్టణంలో వేంచేసియున్న శ్రీ క్షీర రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో 12.2.2026 నుండి 16.2.2026 వరకు జరగబోవు మహాశివరాత్రి మహోత్సవంలో భాగంగాది.5.2.2026 మహాశివరాత్రి సందర్భంగా పాలకొల్లు తాసిల్దార్ కార్యాలయం నందు ఆర్డీవో ఆదేశాల మేరకు మహాశివరాత్రి పై కోఆర్డినేషన్ మీటింగ్ ఏర్పాటు చేసినారు. ఈ మీటింగ్ నందు పాలకొల్లు తాసిల్దర్ వివిధ డిపార్ట్మెంట్ అధికారులకు సూచనలు చేస్తూ భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు కలగ కుండా వారికి సౌకర్యంగా ఉండేటట్టు తొందరగా దర్శనం చేసుకునేటట్టు ఫ్యూ లైన్స్ మరియు మెడికల్ డిపార్ట్మెంట్ వారికి ఫైర్ డిపార్ట్మెంట్ వారికి మున్సిపల్ శాఖ వారికి అందరికీ కూడా భక్తులకు ఇబ్బంది కలువకుండా వారికి మెడిసిన్స్ గాని క్యూ లైన్స్ లో ఆటంకం లేకుండా పోలీస్ వారు తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా విద్యుత్తు అలంకరణలపై విద్యుత్తు డిపార్ట్మెంట్ వారిని ఎప్పటికప్పుడు పరిరక్షించవలసిందిగా తగు సూచనలు చేస్తున్నారు. శానిటేషన్ విషయంలో గాని భక్తులకు ఉచిత ప్రసాదము అరేంజ్ చేసినప్పుడు వారికి ఏ ఇబ్బంది తలెత్తకుండా దేవస్థానం వారికి తగు సూచనలు చేసినారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ వై దుర్గా కిషోర్, మున్సిపల్ కమిషనర్ పార్థసారథి, సర్కిల్ ఇన్స్పెక్టర్ రజిని కుమార్,డిప్యూటీ ఎంపీడీఓ పద్మాజీరావు,హెల్త్ ఆఫీసర్ గుడాల హరి బాబు,ఫైర్ డిపార్ట్మెంట్ రాజ్ కుమార్, ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ ఏఈ ఎస్ కే బాబ్జి,ఎల్ శ్రీనివాస్ రావు,శ్రీ క్షీర రామలింగేశ్వర స్వామి ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ముచ్చర్ల శ్రీనివాసరావు ఆలయ చైర్మన్ మీసాల రామచంద్ర రావు మరియు ఆలయ ధర్మకర్తలు మరియు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



## సర్వేలో నమోదు చేయించుకోకుంటే ప్రభుత్వ పథకాలకు అనర్హులే



- మున్సిపల్ కమిషనర్ విజయ సారధి

**పాలకొల్లు, ఫిబ్రవరి 5,మనం ప్రతినిధిః** ప్రస్తుతం ఏపీ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రతి కుటుంబానికి ప్రత్యేకమైన యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే ( సమీకృత కుటుంబ సర్వే ) నిర్వహిస్తోందని ఆ సర్వేలో ప్రతి కుటుంబం వారి వివరాలను వెల్లడించి నమోదు చేయించుకోవాలని పాలకొల్లు మున్సిపల్ కమిషనర్ బి విజయ సారధి వెల్లడించారు. ఈ సర్వేలో నమోదు కాబడని కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు పొందెందుకు అనర్హులవుతారని ఆయన తెలిపారు. పాలకొల్లు పట్టణంలో 20 వేల కుటుంబాలు ఉన్నాయని, ఇంతవరకు 6,600 కుటుంబాలు సర్వేలో నమోదయ్యారని తెలిపారు. వారం రోజుల్లో పాలకొల్లు పట్టణంలో యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే పూర్తవుతుందని తెలిపారు. పట్టణంలో 14 సచివాలయంల సిబ్బంది సర్వేలో పాల్గొంటున్నారని, వారు ఇంటికి వచ్చినప్పుడు పూర్తి వివరాలు సిబ్బందికి తెలియజేసీ సహకరించాలని కమిషనర్ విజయ సారధి పట్టణ ప్రజలను కోరారు.

## కుక్కునూరు పోలీస్ వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం

**కుక్కునూరు, ఫిబ్రవరి 05 ( మనం న్యూస్)** స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో గల చిరవల్లి గ్రామం లోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ప్రజల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు కుక్కునూరు సి ఐ రమేష్ బాబు తెలిపారు. ఈ యొక్క వైద్య శిబిరం శనివారం ఉదయం 9.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు చీరవేల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎస్ ఐ రాజారెడ్డి పేర్కొన్నారు. ఈ యొక్క సేవలు ఇల ఉన్నాయి.ప్రసూతి విభాగం,జనరల్ మెడిసిన్,ఎముకలు, కీళ్ల విభాగం,చెవి, ముక్కు, గొంతు విభాగం,చర్మ వ్యాధుల విభాగం,కార్డియాలజీ విభాగం గైనకాలజీ విభాగం,కంటి విభాగలకి చెందిన ఎమ్ డి, ఎంబిబిఎస్ అర్హత కలిగిన నిపుణ వైద్యులు ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన సలహాలు అందించనున్నారు. అలానే 40 సంవత్సరం నిండిన ప్రతి మహిళకి ముందస్తు గర్భాశయ క్యాన్సర్ పరీక్ష అవసరమైన వారికి కంటి ఇతర ఆపరేషన్లు ఉచితంగా చేస్తారు అని అలానే అవసరం ఉన్న వారికి ఉచితంగా మందులు ఇస్తారు అని, అందుకు అనుగుణంగా మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కుక్కునూరు సీఐ రమేష్ బాబు, ఎస్ ఐ రాజారెడ్డి తెలిపారు.

## 15 రోజుల్లో అడవిపాలెం-మేడపాడు రహదారి నిర్మాణం పూర్తి



- ఆర్ అండ్ బి డి ఈ రమణ వెల్లడి

**పాలకొల్లు, ఫిబ్రవరి 5 (మనం ప్రతినిధి)ః** పశ్చిమగోదావరి జిల్లా ఎలమంచిలి మండలం అడవి పాలెం గ్రామం నుంచి మేడపాడు గ్రామం వరకు నిర్మిస్తున్న రహదారి నిర్మాణాలు 15 రోజుల్లో పూర్తవుతాయని ఆర్ అండ్ బి పాలకొల్లు సబ్ డివిజన్ డి ఈ బీవీ రమణ తెలిపారు. ఫిబ్రవరి నెలాఖరు నాటికి పూర్తిస్థాయిలో రాకపోకలు చేపట్టడానికి అనుమతించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఐదు కోట్ల రూపాయల నిధులతో చేపట్టిన ఈ రహదారి1.65 కిలోమీటర్ల సిమెంట్ రహదారి, మూడు కిలోమీటర్ల తారు రోడ్డు నిర్మించడం జరుగుతుందని తెలిపారు. నాణ్యత పరంగా నిర్మాణాలు చేపట్టే విధంగా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు డి ఈ రమణ వివరించారు. ద్విచక్ర వాహనదారుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రయాణించే విధంగా రహదారి నిర్మాణాలు చేపడుతున్నట్లు డి ఈ రమణ తెలిపారు.

## అమరావతి బయలుదేరిన నీటి సంఘాలు



**కాట్రేనికోన, ఫిబ్రవరి 5, మనం ప్రతినిధిః** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం మధ్యాహ్నం అమరావతిలో నీటి సంఘాల నాయకులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ మేరకు అందిన ఆహ్వానంతో కాట్రేనికోన మండలంలోని నీటి సంఘాల అధ్యక్షులు ఈ సమావేశానికి బయలుదేరి వెళ్లారు. కాట్రేనికోన నీటి సంఘం చైర్మన్ ఆకాశం శ్రీనివాస్ ఆధ్వర్యంలో వాసంశెట్టిరాజేశ్వరరావు, బండారు ఏసు, ఇసుకపట్ల వెంకటరమణ, రంగరాజు, కొంకి శ్రీను మొదలైన వారు తరలి వెళ్లారు.

## మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు




**కుక్కునూరు, ఫిబ్రవరి 05 ( మనం న్యూస్ )ః** నేటి బాలలే రేపటి పౌరులు సమాజాన్ని తీర్చిదిద్దాల్సిన బాధ్యత బాల బాలికలపై ఉందని ఇంటర్నేషనల్ నింబుల్ హ్యూమన్ రైట్స్ డి.జి.సి.ఇ.ఓ. చైర్మన్ డాక్టర్ సిహెచ్ విజయ మోహన్ రావు పేర్కొన్నారు. గురువారం నేషనల్ నింబుల్ హ్యూమన్ రైట్స్ ఏలూరు జిల్లా ఆధ్వర్యంలో కుక్కునూరు మండలంలోని ఎస్టీ బాలికల ఆశ్రమ పాఠశాల, చీరవల్లి జడ్పీ హైస్కూల్ నందు , రాజీవ్ నగర్ జెడ్పి హై స్కూల్ నందు నో టు సే డ్రగ్స్ , నో టు సే కరెప్షన్ అనే అంశాల మీద విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ యొక్క కార్యక్రమం లో జిల్లాలో ఉన్నటువంటి అన్ని ప్రాంతాలవారీగా విద్యావంతులు అవగాహనా కలిగిన యువకులు, వివిధ శాఖల వారు సహకరించి విద్యార్థులను చైతన్య చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా అధ్యక్షుడు వసంత కుమార్ మాట్లాడుతూ బాల్యం నుంచే విద్యార్థులు.
ఈ అంశాలపై అవగాహన కలిగి ఉండాలని అందుకే ఇటువంటి కార్యక్రమాలను చేపట్టినట్టు వారు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా జనరల్ సెక్రటరీ సుధాకర్ మాట్లాడుతూ డ్రగ్స్ అలవాటు పడితే వచ్చే దుష్ప్రయోజనాల గురించి ఆయన విద్యార్థులకు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా కోఆర్డినేటర్ బయ్యాని నాగేశ్వరరావు , ఏలూరు జిల్లా చీఫ్ అడ్వైజర్ మంత్రి గోపాలకృష్ణ, ఏలూరు జిల్లా వైస్ ప్రెసిడెంట్ బుడుగుల తరుణ్, మునగాల సాయి, కేసరి సాంబశివరావు రాజీవ్ నగర్ హెచ్ఎం, కుకునూరు బాలికల ఆశ్రమ పాఠశాల హెచ్ఎం మంగమ్మ, చీరపల్లి హై స్కూల్ హెచ్ఎం రాధ తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

- గొల్లపెల్లి ఎమ్మార్వో కార్యాలయం ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా అదనపు కలెక్టర్



**జగిత్యాల, ఫిబ్రవరి 05(మనం ప్రతినిధి)ః** గురువారం జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండలం తహసిల్దార్ కార్యాలయంను జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) బి.ఎస్ లత ఆకస్మిక తనిఖీ చేశారు. భూ భారతికి సంబంధించిన పెండింగ్ అంశాలు, ఓటరు జాబితా సవరణ మరియు ఇరిగేషన్ ట్యాంక్స్ సెన్సెక్స్ సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) బి. ఎస్ లత మాట్లాడుతూ నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన భూ సమస్యలపై ప్రతి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మీసేవ సర్టిఫికెట్లను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని సర్టిఫికెట్ల ప్రజలకు అందించవలసిందిగా అధికారులకు ఆదేశించారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం జరిగిన బి ఎల్ ఓ మరియు జి పి ఓ ల సమావేశంలో మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో బి.ఎల్.ఓల పాత్ర కీలకమని చెప్పారు. ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరి ఓటరు నమోదు చేయాలని మరియు వివరాలు సరిచూడాలన్నారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చూడాలన్నారు. అనర్హుల పేర్లను నిబంధనల మేరకు తొలగించాలని సూచించారు. వయస్సు, చిరునామా వంటి వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలన్నారు. ఫోటోలు మరియు ఆధార పత్రాలను పరిశీలించాలని తెలిపారు. ఫారమ్ 6, 7, 8లను సక్రమంగా స్వీకరించాలన్నారు. స్వీకరించిన దరఖాస్తులను సకాలంలో ప్రాసెస్ చేయాలన్నారు. డూప్లికేట్ నమోదులు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఓటర్లకు అవసరమైన అవగాహన కల్పించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలన్నారు. మొబైల్ యాప్ల ద్వారా డేటా అప్లోడ్ చేయాలన్నారు. పారదర్శకతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. అందరు సమన్వయంతో పని చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. పట్టణ,గ్రామ మరియు వార్డు స్థాయిలో పర్యవేక్షణ పెంచాలన్నారు. ప్రత్యేక డ్రైవ్లను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు విలువైనదని గుర్తు చేశారు. ఎన్నికల స్వచ్ఛతకు అందరూ సహకరించాలని కోరారు. బాధ్యతాయుతమైన పని విధానం అవసరమన్నారు. లక్ష్యాల సాధనకు కృషి చేయాలన్నారు. అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించాలని చెప్పారు. నివేదికలను సమయానికి సమర్పించాలన్నారు.ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. తదనంతరం గ్రామాల్లోని చెరువుల యొక్క గణాంకాలు నీటి పారుదల శాఖ తో సమన్వయం చేసుకుంటూ పారదర్శకంగా ఉండేలా చూడాలని జిపివోలను ఆదేశించారు. ఈ సమావేశంలో గొల్లపెల్లి తహసీల్దార్ అబ్దుల్ మాజీద్, రెవెన్యూ సిబ్బంది, జీపివోలు, బి ఎల్ వో లు మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాం తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్



- భద్రత ఏర్పాట్లు, సిసి కెమెరాల పనితీరులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**జగిత్యాల, ఫిబ్రవరి 05 (మనం ప్రతినిధి)ః** రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు గురువారం రోజున జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ దరూర్ క్యాంప్ లో గల ఈవీఎం లను భద్రపరిచిన గోదామును జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రతినెల ఈవీఎం లను తనిఖీ చేయడం జరుగుతుందని గోడౌన్ లోని యంత్రాల భద్రత, సిసి కెమెరాల పనితీరు, సాంకేతికపరమైన అంశాలను సమగ్రంగా పరిశీలించడం జరిగిందని తెలిపారు. గోదాము వద్ద ఎలాంటి లోపాలు లేకుండా పటిష్టమైన భద్రత ఉండాలని, నిత్యం అప్రమత్తతతో పర్యవేక్షించాలని సిబ్బందికి సూచించారు. ఈ పర్యవేక్షణలో అదనపు కలెక్టర్ బిఎస్ లత జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు మరియు కలెక్టరేట్ ఏవో హకీమ్, జగిత్యాల అర్బన్ ఎమ్మార్వో రామ్మోహన్ మరియ తదితరులు పాల్గొన్నారు.

## భయం వీడండి ఫిర్యాదు చేయండి



- ఒక ఫోన్ కాల్ ఒక మెసేజ్ చాలు
- మహిళల భద్రతకు షీ-టీమ్ సేవలు
- రామగుండం సిపి అంబర్ కిషోర్ ఝా

**గోదావరిఖని, ఫిబ్రవరి 5 (మనం న్యూస్)ః** రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధిలో మహిళలు, బాలికల భద్రత కోసం షీ-టీమ్ నిరంతరం సేవలందిస్తుందని రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళలు, బాలికలపై జరుగుతున్న వేధింపుల విషయంలో ధైర్యంగా ఫోన్ కాల్, మెసేజ్ ద్వారా ఫిర్యాదు చేయాలని సిపి సూచించారు. కమీషనరేట్ పరిధిలో పెద్దపల్లి జోన్లో ఒక షీ-టీమ్ పనిచేస్తుందని, షీ టీమ్ వాట్సాప్ నంబర్ 6303923700, పెద్దపల్లి జోన్ షీ టీమ్ 8712659386, 100కు డయల్ చేయాలన్నారు. మహిళలు,బాలికలు సురక్షిత ప్రయాణం కోసం టి-సేఫ్ (ట్రావెల్ సేఫ్) యాప్ను వినియోగించుకోవాలని కోరారు. రామగుండం షీ-టీమ్ వాట్సాప్ నంబర్, 100కు డయల్ ద్వారా ప్రత్యక్షంగా పెద్దపల్లి జోన్ షీ టీమ్ కార్యాలయాలకు జనవరి నెలలో 13 ఫిర్యాదులు అందాయని, షీ-టీమ్ డీకాయ్ ఆపరేషన్లలో పట్టుకున్న వారిపై పెటీ కేసులు నమోదు చేసి, తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చినట్లు ఆ ప్రకటనలో సిపి పేర్కొన్నారు.

## పిల్లల ఎదుగుదలను నిరంతరం మానిటర్ చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి, ఫిబ్రవరి 05 (మనం ప్రతినిధి)ః** పిల్లల ఎదుగుదలను నిరంతరం మానిటర్ చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంక్షేమ శాఖ పని తీరు పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలు నిబంధనల ప్రకారం పనిచేసేలా పర్యవేక్షించాలని కలెక్టర్ అంగన్వాడి సూపర్వైజర్ లను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని 90 అంగన్వాడీ కేంద్రాల మరమ్మత్తుల కోసం 2 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసామని వాటిని సద్వినియోగం చేయాలని కలెక్టర్ తెలిపారు. అంగన్వాడీ కేంద్రంలో ఉన్న పిల్లల ఎదుగుదలను ప్రతి నెలా మానిటరింగ్ చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.గర్భిణీలు, బాలింతలు అంగన్వాడి కేంద్రాలకు వచ్చి ఒక పూట భోజనం తీసుకునేలా చూడాలని అన్నారు. అంగన్వాడి కేంద్రాలకు వచ్చే పాలు, కోడిగుడ్లు, పప్పు దినుసులు, ఇతర ఆహార పదార్థాలు సరిగ్గా స్టోర్ చేయాలని అన్నారు. అంగన్వాడీ టీచర్లు, సూపర్ వైజర్ల పనితీరు మెరుగు పరిచేలా సిడిపిఓ రెగ్యులర్ మానిటరింగ్ చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతివారం అంగన్వాడీ టీచర్ల సూపర్వైజర్ల పని తీరును పరిశీలిస్తానని కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్ రావు, సిడిపిఓ లు అలేఖ్య , పుష్ప, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పురపాలిక ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ ఐ. రాణి కుముదిని

**పెద్దపల్లి, ఫిబ్రవరి 05 (మనం ప్రతినిధి)ః** పురపాలిక ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ ఐ. రాణి కుముదిని అన్నారు.మున్సిపల్ ఎన్నికల పై రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ ఐ. రాణి కుముదిని ఉమ్మడి కరీంనగర్ జిల్లా కలెక్టర్ లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ పురపాలక ఎన్నికలను షెడ్యూల్ ప్రకారం కట్టుదిట్టంగా నిర్వహించాలని కలెక్టర్ లకు ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్ కు అవసరమైన మేర బ్యాలెట్ బాక్సులు బ్యాలెట్ పత్రాలు సిద్ధం చేసుకోవాలని, పోలింగ్ బృందాలు , డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను కట్టుదిట్టంగా ఏర్పాటు చేయాలని అన్నారు.




కౌంటింగ్ కేంద్రాల వద్ద స్ట్రాంగ్ రూమ్ లలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. కౌంటింగ్ ముగిసిన తర్వాత మున్సిపాలిటీలలో చైర్ పర్సన్, కార్పొరేషన్లలో మేయర్ ఎన్నిక కోసం ఫారం 2 లను సిద్ధం చేసి సంసిద్ధం కావాలని, ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు ఇతర ప్రజాప్రతినిధులకు ముందుగానే సమాచారం అందించాలని అన్నారు.
ఈ సమావేశంలో పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, గోదావరిఖని ఏసీపి రమేష్,ఈ సెక్షన్ సూపర్డెంట్ విజయ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# యూనిఫాం కొలువులకు సిద్ధం కావాలి

- ఎమ్మెల్యే గొండు శంకరరావు పిలుపు
- కళింగపట్నంలో ఘనంగా సీఐఎస్ఎఫ్ సైక్లథాన్



గార, ఫిబ్రవరి 5: దేశ భద్రతలో సముద్ర తీరాల రక్షణ అత్యంత కీలకమని, దానికోసం సిఐఎస్ఎఫ్ జవాన్లు చేస్తున్న సాహసయాత్ర స్ఫూర్తిదాయకమని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకరరావు పేర్కొన్నారు. కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం ఆధ్వర్యంలో చేపట్టిన 'వందేమాతరం కోస్టల్ సైక్లథాన్-2026' బృందం గురువారం కళింగపట్నం చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక బుద్ధా స్కూల్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కోస్టల్ భద్రతతో పాటు దేశభక్తిని పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు అభినందనీయమని, పురుషులతో సమానంగా మహిళా జవాన్లు సైతం ఈ సైకిల్ యాత్రలో పాల్గొనడం గర్వకారణమని ఆయన కొనియాడారు. యువత దేశ రక్షణకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ కమాండెంట్ దువ్వాడ జితేంద్రబాబు మాట్లాడుతూ తీర భద్రత దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వంటిదని స్పష్టం చేశారు. ఉద్యోగార్థులైన యువతకు తీపి కబురు అందిస్తూ.. గత ఏడాది సీఐఎస్ఎఫ్లో 16,000 పోస్టులను భర్తీ చేశామని, ఈ ఏడాది మరో 15,000 ఖాళీల భర్తీ జరుగుతుందని వెల్లడించారు. ఈ అవకాశాలపై యువతకు విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం శాంతిభద్రతలే కాకుండా, దేశ సంపదను కాపాడటంలో సీఐఎస్ఎఫ్ పాత్రను వివరించారు.

అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థుల 'మహాగణపతిం' నృత్య ప్రదర్శనతో ప్రారంభమైన వేడుకల్లో.. రాజారావు బృందం అందించిన సాక్సోఫోన్ ప్రదర్శన వినసొంపుగా సాగింది. కుమారి హారిక ఆలపించిన గీతాలు, మాస్టర్ కామేశ్వర్ కోలాటం బృందం ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. యాత్ర బృందానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ సౌత్ జోన్ డీఐజీ డాక్టర్ ఎం.జి. రాఘవేంద్ర కుమార్, సీనియర్ కమాండెంట్ సతీష్ కుమార్ బాజ్పాయ్, తదితర ఉన్నతాధికారులతో పాటు స్థానిక ప్రముఖులు, పాఠశాల ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

**యాత్ర విశేషాలు:-**

దేశవ్యాప్తంగా 6,553 కిలోమీటర్ల మేర సాగుతున్న ఈ 'వందేమాతరం' సైక్లోథాన్లో 130 మంది జవాన్లు పాల్గొంటున్నారు. ఇందులో 65 మంది మహిళా సిబ్బంది ఉండటం విశేషం. గతనెల 28న పశ్చిమ బెంగాల్లో ప్రారంభమైన ఈ యాత్ర, 9 రాష్ట్రాల మీదుగా 52 తీర ప్రాంత గ్రామాల్లో అవగాహన కల్పిస్తూ ఈ నెల 22న కేరళలోని కొచ్చిలో ముగియనుంది. దేశ ఆర్థిక వ్యవస్థలో కీలకమైన ఓడరేవుల భద్రతపై ప్రజలను అప్రమత్తం చేస్తూ, సీఐఎస్ఎఫ్లో రానున్న 15,000 ఉద్యోగ అవకాశాలపై యువతకు ఈ బృందం అవగాహన కల్పిస్తోంది.

# ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాల పరిశీలన విజయవంతంగా పూర్తి

## ఎఎస్ఆర్ జిల్లాలో ఆర్వైఎస్ఎస్ ప్రముఖుల బృందం పర్యటన



ప్రకృతి వ్యవసాయ ప్రోత్సాహం మరియు గ్రామీణ రైతుల సాధికారత లక్ష్యంగా, సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్ డైరెక్టర్ ,ఎస్.సి. శ్రీనివాస్ , అలాగే గౌతమ్ ముఖోపాధ్యాయ 04-02-2026 నుండి 05-02-2026 వరకు అల్లూరి సీతారామరాజు జిల్లాలో పర్యటించి ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా బాలియగూడ, దుంబ్రిగూడ మరియు అరకు వ్యాలీ ప్రాంతాల్లోని ప్రకృతి వ్యవసాయ నమూనా పొలాలను సందర్శించి రైతులతో ప్రత్యక్షంగా మమేకమయ్యారు. రైతులు అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, పంటల స్థితి, వ్యయ నియంత్రణ, మార్కెటింగ్ అవకాశాలపై విస్తృతంగా చర్చించారు.

కాఫీ ఆధారిత సాగు విధానాలు, ఎప్వో కార్యకలాపాలు మరియు విలువ ఆధారిత ఉత్పత్తులపై కూడా అధికారులు పరిశీలన చేశారు. రైతులతో జరిగిన సమావేశాల్లో ప్రకృతి వ్యవసాయం వల్ల నేల సారవంతత పెరగడం, పంటల నాణ్యత మెరుగుపడడం, ఉత్పత్తి ఖర్చులు తగ్గడం వంటి ప్రయోజనాలను అధికారులు ప్రశంసించారు. భవిష్యత్తులో ఈ విధానాలను మరింత విస్తరించేందుకు కార్యాచరణ రూపొందించాలని సూచించారు.

ఈరోజు కోడపల్లి గ్రామంలో అమలు చేస్తున్న ఎటీఎం మోడల్ను అధికారులు సందర్శించారు. గ్రామంలోని రైతులు సమిష్టిగా సుమారు 25 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో కూరగాయల సాగు చేస్తున్న విధానాన్ని పరిశీలించి, రైతుల నుంచి పంటల నిర్వహణ పద్ధతులను నేరుగా తెలుసుకున్నారు. 5వ తేదీన నిట్టపుట్టులోని ఎంఎన్ మాక్స్ కో-ఆపరేటివ్ సొసైటీ కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ను సందర్శించి, కాఫీ ప్రాసెసింగ్ విధానాలను పరిశీలించారు. పంట సేకరణ, ప్రాసెసింగ్, గ్రేడింగ్, మార్కెటింగ్ విధానాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే కాఫీ ఎ-గ్రేడ్ మోడల్ను కూడా వీక్షించారు. ఈ పర్యటన విజయవంతంగా ముగిసిన సందర్భంగా సహకరించిన రైతులు, క్షేత్రస్థాయి సిబ్బంది మరియు సంబంధిత అధికారులకు ఆర్వైఎస్ఎస్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం జిల్లాలో ప్రకృతి వ్యవసాయ విస్తరణకు మరింత బలాన్నిస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# చమురు కొనుగోళ్లు.. 140 కోట్లమంది

- ఇంధన భద్రతకే ప్రాధాన్యం
- భారత విదేశాంగశాఖ



ఢిల్లీ, ఫిబ్రవరి 5 : రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు నిలిపేసి.. అమెరికా, వెనెజువెలా నుంచి దిగుమతి చేసుకుంటుందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల పేర్కొన్నారు. ఈ అంశంపై భారత విదేశాంగశాఖ స్పందించింది. 140 కోట్లమంది దేశ ప్రజల ఇంధన భద్రతే తమకు అత్యంత ప్రాధాన్య అంశమని, చమురు సేకరణ విషయంలో ప్రభుత్వ విధానాలకు ఇదే మూలమని స్పష్టం చేసింది. మార్కెట్ పరిస్థితులు, అంతర్జాతీయ పరిణామాలకు అనుగుణంగా విభిన్న సరఫరాదారులను ఆశ్రయించడం అనేది ప్రభుత్వ వ్యూహంలో భాగమని పేర్కొంది.

ఇంధన భద్రత విషయంలో మా విధానాలకు అనుగుణంగా.. వెనెజువెలా సహా ఏ దేశం నుంచైనా ముడి చమురు కొనుగోలుకు సిద్ధంగా ఉన్నాం'' అని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్వాల్ ఓ మీడియా సమావేశంలో చెప్పారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం దేశ ఎగుమతులు, పరిశ్రమలు, ఉద్యోగ కల్పన, వృద్ధి, ప్రజల సంక్షేమానికి ఊతమిస్తుందని తెలిపారు. మరోవైపు.. ఇటీవలి ఇరాన్ ఆందోళనల సమయంలో అక్కడ ఉన్న భారతీయులు మృతి చెందినట్లు, తప్పిపోయినట్లు నివేదికలేవీ లేవని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. టెహ్రాన్లోని భారత రాయబార కార్యాలయం స్థానిక భారత పౌరులతో నిత్యం సంప్రదింపుల్లో ఉందని విదేశాంగశాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ రాజ్యసభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. తాజా అంచనాల ప్రకారం.. ఆ దేశంలో దాదాపు 10 వేలమంది ప్రవాస భారతీయులు ఉన్నట్లు చెప్పారు.

# నేను పశ్చాత్తాప పడుతున్నా



## ఎప్స్టీన్ కుంభకోణంపై బిల్గేట్స్

వాషింగ్టన్, ఫిబ్రవరి 5: ఎప్స్టీన్ సెక్స్ కుంభకోణం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఆ వ్యవహారంలో మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్గేట్స్కు సంబంధించిన పలు విషయాలు వెల్లడయ్యాయి. దీనిపై తాజాగా గేట్స్ స్పందించారు. అతడితో ఉన్న ప్రతీ క్షణానికి చింతిస్తున్నానని చెప్పారు. ఈ మేరకు ఆస్ట్రేలియా మీడియా సంస్థతో మాట్లాడారు.

''ఎప్స్టీన్ కోసం కేటాయించిన ప్రతీ క్షణానికి ఇప్పుడు నేను చింతిస్తున్నాను. అందుకు క్షమాపణలు కోరుతున్నాను. అయితే ఆ ఈ-మెయిల్లో ఉన్నది నిజం కాదు. అప్పుడు అతడి ఆలోచన ఏంటో నాకు తెలియదు. ఏదోఒక రూపంలో అతడు నన్ను టార్గెట్ చేయాలని ప్రయత్నించాడా..?'' అని వ్యాఖ్యలు చేశారు. ఆ సెక్స్ కుంభకోణం దర్యాప్తునకు సంబంధించి 30 లక్షల పేజీలను అమెరికా న్యాయశాఖ ఇటీవల విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఇందులో గేట్స్కు సంబంధించిన ఓ విషయం వెలుగులోకి వచ్చింది. ఆయన రష్యన్ మహిళలతో లైంగిక సంబంధాలు నెరిపాడని.. అందువల్లే ఆయన సుఖవ్యాధుల బారినపడ్డారని ఎప్స్టీన్ ఆరోపణలు చేశాడు.

2013లో తనకి తాను రాసుకున్న ఈ-మెయిల్లో అతడు ఈ విషయాలు ప్రస్తావించాడు. ఆ విషయం బయటపడకుండా ఉండేందుకు ఆయన మిలిండా (గేట్స్ మాజీ భార్య)కు రహస్యంగా ఇచ్చేందుకు యాంటీబయాటిక్స్ను అడిగారని రాసుకొచ్చాడు. ఆ పరిణామాల తర్వాత తనతో ఉన్న ఆరేళ్ల స్నేహాన్ని గేట్స్ తెంచుకున్నాడని ఎప్స్టీన్ వెల్లడించాడు.

అయితే ఈ-మెయిల్లోని అంశాలను గేట్స్ బృందం ఖండించింది. ఇదిలాఉంటే.. ఈ ఫైళ్ల విడుదల తర్వాత మిలిండా స్పందించిన సంగతి తెలిసిందే. ''నా వివాహంలో ఎంతో బాధించే కొన్ని విషయాలు ఉన్నాయి. ఇప్పుడు బయటకు వచ్చిన వాటిపై సమాధానం ఇవ్వాల్సింది బిల్గేట్స్.. నేను కాదు. బాధిత మహిళలకు న్యాయం లభిస్తుందని ఆశిస్తున్నా'' అని పేర్కొన్నారు. మూడు దశాబ్దాల వివాహ బంధానికి స్వస్తి పలుకుతూ బిల్గేట్స్ - మిలిందా దంపతులు 2021లో విడాకులు తీసుకున్నారు. ఎప్స్టీన్తె గేట్స్కు సంబంధాలు ఉండడం నచ్చని మిలిందా ఆయన నుంచి విడాకులు తీసుకున్నారని అప్పట్లో వార్తలు వచ్చాయి.

# నోరు జారొద్దు..

## ట్రంప్ పదవీకాలం ముగిసేవరకు చూస్తాం


- తేల్చిచెప్పిన భారత్
- బ్లూమ్బర్గ్ కథనం



వాషింగ్టన్ , ఫిబ్రవరి 5 : అమెరికా- భారత్ల మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. అయితే, ఈ ఒప్పందానికి కొన్ని నెలల ముందు ఇరుదేశాలకు చెందిన నాయకుల మధ్య జరిగిన కీలక సమావేశానికి సంబంధించిన విషయాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. ట్రేడ్ డీల్ కోసం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదవీకాలం ముగిసేవరకు వేచి చూస్తామని నాడు భారత్ తేల్చిచెప్పినట్లు తెలుస్తోంది. ఈ మేరకు బ్లూమ్బర్గ్ తన కథనంలో పేర్కొంది. ప్రస్తుతం ఇది చర్చనీయాంశంగా మారింది. కథనం ప్రకారం.. సెప్టెంబరు ప్రారంభంలో భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ , యూఎస్ విదేశాంగ మంత్రి మార్కో రూబియోల మధ్య సమావేశం జరిగింది. ఆ సమయంలో భారత ప్రభుత్వంపై, ప్రధాని మోడీపై ట్రంప్, ఆయన వాణిజ్య సలహాదారు పీటర్ నవారో సహా పలువురు అధికారులు నోరు పారేసుకోవడం, టారిఫ్ల విషయంలో పలుమార్లు బెదిరింపులకు పాల్పడిన విషయం కూడా తెలిసిందే. నాడు జరిగిన భేటీలో భారత్ తన వైఖరిని స్పష్టంగా తెలియజేసింది. 'ట్రంప్, ఆయన పరిపాలనాధికారుల బెదిరింపులకు భారత్ తలొగ్గదు. ట్రేడ్ డీల్ కోసం ట్రంప్ పదవీకాలం ముగిసేవరకు వేచి ఉండటానికి కూడా సిద్ధంగా ఉన్నాం' అని డోభాల్ రూబియోతో చెప్పినట్లు బ్లూమ్బర్గ్ పేర్కొంది.దీంతోపాటు భారత్పై బహిరంగ విమర్శలు తగ్గిస్తే ఇరుదేశాల మధ్య సంబంధాలు మళ్లీ గాడిలోకి వస్తాయని డోభాల్ స్పష్టం చేశారు. ఈ సమావేశం జరిగిన కొన్ని రోజులకే ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత ప్రధాని మోడీకి ట్రంప్ పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పారు. ఆ సమయంలో ప్రధానిపై అమెరికా అధ్యక్షుడు ప్రశంసలు కురిపించారు. ఈ సమావేశం గురించి అమెరికా విదేశాంగ ప్రతినిధి మాట్లాడుతూ.. ప్రైవేటు చర్చల వివరాలు బయటకు వెల్లడించలేమన్నారు. ఇక, భారత్ దీనిపై ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు.

# ఏ దేశం నుంచైనా భారత్ చమురు కొనొచ్చు

## ఆ దేశానికి స్వేచ్ఛ ఉంది: రష్యా



మాస్కో, ఫిబ్రవరి 5 : ప్రపంచంలోని ఏ దేశం నుంచైనా భారత్ చమురును కొనుగోలు చేయవచ్చని, ఆ దేశానికి ఆ స్వేచ్ఛ ఉందని రష్యా స్పష్టం చేసింది. విభిన్న ముడి చమురు సరఫరాదారులను ఆ దేశం ఆశ్రయించడం కొత్తేమీ కాదని పేర్కొంది. 'భారత్కు రష్యా ఒక్కటే చమురును సరఫరా చేయడం లేదన్న విషయం మాతోపాటు అంతర్జాతీయ ఇంధనరంగ నిపుణులందరికీ తెలుసు. ఆ దేశం ఎప్పటి నుంచో ఇతర దేశాల నుంచీ చమురును కొనుగోలు చేస్తోంది. అందువల్ల భారత్ చమురు కొనుగోళ్లను నిలిపేయడం కొత్త విషయంగా తోచడం లేదు' అని రష్యా అధ్యక్ష భవనం క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ వ్యాఖ్యానించారు.

భారత్, రష్యాల మధ్య హైడ్రోకార్బన్ల వాణిజ్యం ఇద్దరికీ లాభదాయకమని రష్యా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి మారియా జఖరోవా తెలిపారు.

రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారతీయ రిఫైనరీలు పూర్తిగా ఆపలేవని ఆ దేశ జాతీయ ఇంధన భద్రతా నిధి నిపుణుడు ఐగోర్ యుష్కోవ్ స్పష్టం చేశారు. 'అమెరికా ఎగుమతి చేసే షేల్ చమురు తక్కువ గ్రేడ్లు కలిగి ఉంటుంది. గ్యాస్ కూడా తక్కువ కండెన్సేట్తో ఉంటుంది. వాటితో పోలిస్తే రష్యా భారీ, సల్ఫర్ అధికంగా ఉండే యూరల్స్ను సరఫరా చేస్తుంది. తక్కువ గ్రేడ్లు ఉండే చమురును అమెరికా నుంచి భారత్ అధిక ధరకు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అంటే ప్రత్యామ్నాయం అంత సులభం కాదని అర్థమవుతోంది. పైగా రష్యా రోజుకు 15 లక్షల నుంచి 20 లక్షల బ్యారెళ్ల చమురును సరఫరా చేస్తోంది. అంత పరిమాణంలో అమెరికా చేయలేదు' అని యుష్కోవ్ వ్యాఖ్యానించారు. 2022లో భారత్ అమెరికా, ఇతర దేశాల నుంచి చమురు కొనడంవల్ల బ్యారెల్ ధర 120 డాలర్లకు పెరిగిందని వివరించారు.

# ఆర్ఏసీకింద బెర్త్ లభించకుంటే..

## టికెట్ ఛార్జీలో కొంత తిరిగివ్వాలి!

## పార్లమెంటరీ కమిటీ



ఢిల్లీ, ఫిబ్రవరి 5 : రైలు ప్రయాణంలో ఆర్ఏసీ కేటగిరి కింద బుక్ చేసుకున్న టికెట్లకు పూర్తి ఛార్జీ వసూలు చేయడం సమర్థనీయం కాదని పార్లమెంటరీ కమిటీ పేర్కొంది. ఆర్ఏసీలోనే ఉండి బోర్డింగ్ సమయంలో బెర్త్ లభించని ప్రయాణికులకు ఛార్జీలో కొంత మేర తిరిగి ఇవ్వాలని సూచించింది. ఇందుకోసం ప్రత్యేక వ్యవస్థను రూపొందించాల్సిన అవసరం ఉందని తెలిపింది. ''పంక్చువాలిటీ అండ్ ట్రావెల్ టైమ్ ఇన్ ట్రైన్ ఆపరేషన్స్ ఇన్ ఇండియన్ రైల్వేస్'' పేరుతో పార్లమెంటుకు సమర్పించిన నివేదికలో ప్రజాపద్దుల కమిటీ పేర్కొంది.

ప్రస్తుతం ఆర్ఏసీ కింద బెర్త్ బుక్ చేసుకునే ప్రయాణికుల నుంచి పూర్తి మొత్తంలో టికెట్ ఛార్జీ వసూలు చేస్తున్నారు. ఇదే కేటగిరి కింద ఉండే మరో ప్రయాణికుడితో బెర్త్ పంచుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఇద్దరు ప్యాసింజర్లు పూర్తి మొత్తాన్ని చెల్లిస్తున్నారు. ఇలాంటి ప్రయాణికులకు టికెట్లో కొంత మొత్తాన్ని తిరిగి చెల్లించాలని, ఇందుకు సంబంధించి తీసుకున్న చర్యలను తెలియజేయాలని పార్లమెంటరీ కమిటీ ఆదేశించింది.

# పుతిన్, ట్రంప్లకు జిన్పింగ్ ఫోన్

- బంధం బలోపేతంపై చర్చ

బీజింగ్: చైనా అధినేత షీ జిన్పింగ్.. బుధవారం రష్యా, అమెరికా అధ్యక్షులు పుతిన్, ట్రంప్లతో ఫోన్లో మాట్లాడారు. పుతిన్తో మాట్లాడిన కొద్ది గంటల్లోనే ఆయన ట్రంప్తోనూ మాట్లాడటం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇలా ఒకే రోజు కొద్ది గంటల వ్యవధిలో జిన్పింగ్ ఇద్దరు అగ్ర నేతలతో మాట్లాడటం అరుదు. రష్యా, చైనాల మధ్య బంధాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తున్న నేపథ్యంలో పుతిన్తో చర్చలు జరిపినట్లు సమాచారం. రెండు దేశాల మధ్య సంబంధాల బలోపేతానికి భారీ ప్రణాళిక అవసరమని పుతిన్తో జిన్పింగ్ అన్నారు. అలాగే జపాన్తో సంబంధాలు దెబ్బతిన్న నేపథ్యంలో ట్రంప్తో జిన్పింగ్ మాట్లాడినట్లు భావిస్తున్నారు. కాగా ఇరాన్ అంశంపై జిన్పింగ్తో చర్చించానని ట్రంప్ తెలిపారు. తైవాన్, ఏప్రిల్లో తన చైనా పర్యటనపైనా చర్చించామని వెల్లడించారు. వాణిజ్య అంశాలూ చర్చకు వచ్చాయని తెలిపారు. ఇరాన్ విషయంలో తమకు సహకరించాలని జిన్పింగ్ను ట్రంప్ కోరినట్లు తెలిసింది.

# ట్రంప్ అణు మెలిక

## 'న్యూ స్టార్ట్'లోకి చైనాను లాగే ప్రయత్నం

## నేటితో ముగియనున్న ఒప్పందం



వాషింగ్టన్, ఫిబ్రవరి 5 : ప్రపంచంలో అత్యధిక అణ్వాయుధాలున్న దేశాలు అమెరికా, రష్యా. ఈ రెండింటి వాటాయే దాదాపు 80 శాతం. అందుకే గతంలో ఈ రెండు దేశాలు అనేక ద్వైపాక్షిక అణ్వాయుధ నియంత్రణ ఒప్పందాలను కుదుర్చుకున్నాయి. వాటిలో కీలకమైంది న్యూ స్టార్ట్. ఈ వ్యూహాత్మక ఆయుధాల తగ్గింపు ఒప్పందం గడువు గురువారంతో ముగియనుంది. ఈ నేపథ్యంలో రెండు దేశాలు కొత్త ఒప్పందాన్ని కుదుర్చుకుంటాయా, రద్దు చేసుకుంటాయా..అన్న చర్చ మధ్య మరో కీలక అంశం తెరపైకి వచ్చింది. అదే న్యూ స్టార్ట్లోకి చైనా కూడా చేరాలని ట్రంప్ చేస్తున్న ప్రతిపాదన. మరిందుకు డ్రాగన్ అంగీకరిస్తుందా..?

**ట్రంప్ వ్యూహం**

వెనెజువెలా, గ్రీన్లాండ్ అంశాల్లో వివాదాస్పదంగా వ్యవహరించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పుడు న్యూ స్టార్ట్ విషయంలోనూ తలదూర్చారు. ఈ ఒప్పందంపై ఇటీవల ఆయన 'న్యూయార్క్ టైమ్స్'తో మాట్లాడుతూ, 'న్యూ స్టార్ట్' స్థానంలో రష్యాతో కొత్త ఒప్పందాన్ని కుదుర్చుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. 'గడువు ముగిస్తే ముగిసిపోనీ.. మేమింకా మెరుగైన ఒప్పందాన్ని కుదుర్చుకుంటాం' అని పేర్కొన్నారు. దీంతో ప్రతిష్టంభన తొలగిపోయిందని అనుకున్నారంతా. అంతలోనే ట్రంప్ మళ్లీ ఓ బాంబు పేల్చారు. ఏ అణుచర్చలు జరిగినా అందులో చైనా భాగస్వామిగా ఉండాలని తాను కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ వ్యాఖ్యే ఇప్పుడు గుబులు రేపుతోంది. ఇందులోకి బీజింగ్ను లాగడం ద్వారా మొత్తం ఒప్పందాన్ని ట్రంప్ ఇరకాటంలో నెడుతున్నారని అంటున్నారు నిపుణులు.

**చైనా అంగీకరిస్తుందా..**

అమెరికా, రష్యా అంత స్థాయిలో చైనా దగ్గర అణ్వాయుధాలు లేకపోయినా.. ఆ దేశమూ ఇటీవల దూకుడు పెంచింది. ఈ పరిణామం ట్రంప్ యంత్రాంగాన్ని కలవరపరుస్తోంది. అందుకే ద్వైపాక్షిక ఒప్పందంగా ఉన్న 'న్యూ స్టార్ట్'ను త్రైపాక్షికంగా మార్చాలని ట్రంప్ భావిస్తున్నారు. న్యూ స్టార్ట్లోకి చైనాను చేర్చడం ద్వారా ఆ దేశ అణ్వాయుధాలపై నియంత్రణ విధించాలన్నది ఆయన ప్రణాళిక.

ఈ పరిణామాలను బీజింగ్ కూడా గమనిస్తోంది. రష్యా, అమెరికా ఆయుధ నియంత్రణ ఒప్పందాల్లో తమ దేశం భాగస్వామి కాబోదని గతంలో చాలా సార్లు చైనా పేర్కొంది. ఇప్పుడూ అదే వైఖరితో ఉంది. అమెరికా, రష్యా మధ్య 'న్యూ స్టార్ట్' ఒప్పందం కుదరకపోతే ప్రపంచవ్యాప్తంగా అణ్వాయుధ పోటీ మొదలవుతుందని చైనాకు తెలుసు. ఆ సమయానికి తాను కూడా పూర్తి రేసులో ఉండేలా సన్నాహాలు చేసుకుంటోంది. ఈ నేపథ్యంలో న్యూ స్టార్ట్పై రానున్న రోజుల్లో ట్రంప్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది కీలకం కానుంది.

న్యూ స్టార్ట్ అంటే వ్యూహాత్మక ఆయుధాల తగ్గింపు ఒప్పందం. అమెరికా, రష్యాల మధ్య ప్రస్తుతం అమల్లో ఉన్న ఏకైక అణ్వాయుధ నియంత్రణ ఒప్పందమిదే. 2010లో దీనిపై నాటి అమెరికా, రష్యా అధ్యక్షులు బరాక్ ఒబామా, దిమిత్రి మెద్వదెవ్ సంతకాలు చేశారు. ఇది అమల్లోకి వచ్చింది మాత్రం 2011లో. ఈ ఒప్పందంలో భాగంగా రెండు దేశాలు 1550కి మించి వార్ హెడ్లను మోహరించకూడదు. 700 క్షిపణులు, బాంబర్లకే పరిమితం కావాలి. 2021లో ఈ ఒప్పందాన్ని మరో ఐదేళ్ల పాటు పొడిగిస్తూ రెండు దేశాలు నిర్ణయం తీసుకున్నాయి. ఇప్పుడు ఆ గడువు ముగియనుంది.

# ఉద్యానవనాల అభివృద్ధికి కీలక అడుగులు

- 6 పార్కుల అభివృద్ధికి మంత్రి టీ.జీ. భరత్ శంకుస్థాపన



కర్నూలు ఫిబ్రవరి 05మనం న్యూస్ః నగరంలో పచ్చదనాన్ని పెంపొందించి ప్రజలకు మెరుగైన విశ్రాంతి వాతావరణం కల్పించే దిశగా ఉద్యానవనాల అభివృద్ధికి కీలక చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీ.జీ. భరత్ తెలిపారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో రూ.1.05 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయనున్న ఆరు పార్కుల పనులకు మంత్రి, కమిషనర్ పి.విశ్వనాథ్తో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడంలో భాగంగా ఒకేసారి రూ.1.05 కోట్లతో ఆరు పార్కుల అభివృద్ధికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. రెండు నెలల్లో పనులు పూర్తి చేస్తామని చెప్పారు. 2019 నుంచి 2024 వరకు పార్కులను పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. తమ తండ్రి మంత్రిగా ఉన్న సమయంలో అనేక కాలనీల్లో పార్కులకు స్థలాలు గుర్తించి అభివృద్ధి చేశారని, అనంతరం వచ్చిన ఎమ్మెల్యేలు వాటిపై నిర్లక్ష్యం వహించారని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని పార్కులను అభివృద్ధి చేస్తామని, ప్రతి పార్కులో నడకబాటలు, జిమ్ వంటి సదుపాయాలు పక్కాగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. స్వచ్ఛమైన గాలి కోసం విస్తృతంగా మొక్కలు నాటడం జరుగుతుందని చెప్పారు. పార్కుల అభివృద్ధి నగర సౌందర్యాన్ని పెంచడమే కాకుండా ప్రజలకు ఆరోగ్యకరమైన జీవనశైలికి దోహదపడుతుందని పేర్కొన్నారు. పిల్లలు, యువత, వృద్ధులు సేదతీరేలా అవసరమైన సదుపాయాలతో పార్కులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నగరంలో హరిత వాతావరణాన్ని మరింత విస్తరించే చర్యలు కొనసాగుతాయని వెల్లడించారు. కమిషనర్ మాట్లాడుతూ.. 45వ వార్డులోని ప్రేమ్నగర్ పార్క్-2ను రూ.15 లక్షలతో, 44వ వార్డులోని ఎంపీఎల్ ఎంప్లాయిస్ కాలనీ పార్కు రూ.15 లక్షలతో, ఎల్ఐసీ కాలనీ పార్కు రూ.25 లక్షలతో, 24వ వార్డులోని మధుర్నగర్ పార్కు రూ.15 లక్షలతో, 23వ వార్డులోని సీ క్యాంప్ పార్కు రూ.15 లక్షలతో, 25వ వార్డులోని బిర్లా భావన్ పార్కు రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటిస్తూ పనులను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేసేలా అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ఎస్ఈ రమణమూర్తి, డిసిపి వెంకటరమణ, ఎంఈ మనోహర్ రెడ్డి, డిఈఈలు కృష్ణలత, పవన్, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, తదితరులు పాల్గొన్నారు.

## సీమలో సాగునీటి సమస్యలు తీర్చటమే లక్ష్యం



నందికొట్కూరు, ఫిబ్రవరి 5 (మనం న్యూస్)ః రాయలసీమ ప్రజల సాగు, త్రాగునీటి సమస్యలు తీర్చటమే లక్ష్యంగా వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ ఉద్యమ బాట అని వైసిపి నాయకులు పేర్కొన్నారు. వైఎస్ఆర్సిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి ,నందికొట్కూరు నియోజకవర్గ సమన్వయకర్త ధారా సుధీర్ సిద్ధార్థ రెడ్డి ఆధ్వర్యంలో పోతిరెడ్డిపాడు గ్రామంలో గురువారం భారీ బహిరంగ సభ నిర్వహించారు. రాయలసీమ ప్రాంతానికి అన్యాయం చేయడం అలవాటుగా మారిందని వైయస్సార్సీపి పార్టీ నాయకులు తీవ్రంగా విమర్శించారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పూర్తయితే సీమ జిల్లాలతో పాటు ప్రకాశం, నెల్లూరు జిల్లాలో కూడా తాగునీరు, సాగునీటి సమస్యలు శాశ్వతంగా పరిష్కారమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి , పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి , మాజీ మంత్రివర్యులు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి , కాకాని గోవర్ధన్ రెడ్డి , నంద్యాల, కర్నూలు, అనంతపురం, చిత్తూరు, తిరుపతి, కడప, అన్నమయ్య నెల్లూరు, ప్రకాశం, ఒంగోలు జిల్లాల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, శాసనమండలి సభ్యులు, మాజీ ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు తదితరులు పాల్గొన్నారు.

## సీమలో సాగునీటి సమస్యలు తీర్చటమే లక్ష్యం



- వైయస్సార్సీపి నాయకులు

జూపాడుబంగ్లా,ఫిబ్రవరి 5 (మనం న్యూస్)ః రాయలసీమ ప్రజల సాగు, త్రాగునీటి సమస్యలు తీర్చటమే లక్ష్యంగా వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ ఉద్యమ బాట అని వైసిపి నాయకులు పేర్కొన్నారు. ఫిబ్రవరి 5 వ తేదీన గురువారం జూపాడుబంగ్లా పోతిరెడ్డిపాడు గ్రామంలో వైఎస్ఆర్సిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి , వైయస్సార్సీపి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి,నందికొట్కూరు నియోజకవర్గ సమన్వయకర్త ధారా సుధీర్, ఆధ్వర్యంలో పోతిరెడ్డిపాడు గ్రామంలో గురువారం భారీ బహిరంగ సభ నిర్వహించారు. రాయలసీమ ప్రాంతానికి అన్యాయం చేయడం కూటమి ప్రభుత్వ సీఎం నారా చంద్రబాబు నాయుడు,కి అలవాటుగా మారిందని వైయస్సార్సీపి పార్టీ నాయకులు సజ్జల రామకృష్ణారెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తీవ్రంగా విమర్శించారు.. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పూర్తయితే సీమ జిల్లాలతో పాటు ప్రకాశం, నెల్లూరు జిల్లాలో కూడా తాగునీరు, సాగునీటి సమస్యలు శాశ్వతంగా పరిష్కారమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైయస్సార్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ మంత్రివర్యులు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి , కాకాని గోవర్ధన్ రెడ్డి , నంద్యాల, కర్నూలు, అనంతపురం, చిత్తూరు, తిరుపతి, కడప, అన్నమయ్య నెల్లూరు, ప్రకాశం, ఒంగోలు జిల్లాల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, శాసనమండలి సభ్యులు, మాజీ ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

## ఏపీ సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

- రాష్ట్ర రెవెన్యూ మరియు రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్



కర్నూలు, ఫిబ్రవరి 05మనం న్యూస్: రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యుల పర్యటనలో ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా విజయవంతం చేయాలని రాష్ట్ర రెవెన్యూ మరియు రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి వర్యులు అనగాని సత్యప్రసాద్ అధికారులకు సూచించారు. ఈ నెల 6 వ తేదీన ఎమ్మిగనూరు మండలం కలుగొట్ల గ్రామంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా రాజముద్రతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేయనున్న సందర్భంగా అందుకు సంబంధించిన ఏర్పాట్లను రాష్ట్ర రెవెన్యూ మరియు రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి వర్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి గ్రామ సభా ప్రాంగణం వద్ద చేస్తున్న ఏర్పాట్లు, స్టాల్ ఏర్పాట్లు, గ్రీన్ రూమ్ ఏర్పాట్లు, పార్కింగ్, హెలిప్యాడ్, భద్రత పరంగా తీసుకుంటున్న చర్యలు అన్నిటిని పరిశీలిస్తూ సంబంధిత అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. సభకు హాజరయ్యే ప్రజలు, రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా త్రాగునీరు, భోజనం ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు వారికి కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సీఎం ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ పెందుర్తి వెంకటేశ్, అడిషనల్ సిసిఎల్ఏ వెంకట మురళి, జాయింట్ సెక్రటరీ చేతన్, స్థానిక శాసనసభ్యులు జయ నాగేశ్వర రెడ్డి, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ పార్టీలో వాల్మీకులకు పెద్దపీట



- 4టీడీపీ అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ ను సన్మానిస్తున్న సర్పంచ్ రాముల విజయ్

తుగ్గలి ఫిబ్రవరి 5 (మనం న్యూస్)ః తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కర్నూలు జిల్లాలో వాల్మీకులకు పెద్దపీట వేశారని ఎద్దులదొడ్డి సర్పంచ్ రాముల విజయ్ అన్నారు. గురువారం టిడిపి జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మను శాలువా పూలమాలతో సర్పంచ్ రాముల విజయ్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో ఎంతోమంది సంపన్న వర్గాలు కు చెందినవారు ఉన్నప్పటికీ, వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన మహిళ గుడిసె కృష్ణమ్మకు జిల్లా టిడిపి అధ్యక్ష పదవి ఇవ్వడంతోపాటు, బీటి నాయుడు కు కూడా ఎమ్మెల్సీగా పదవి ఇచ్చి విధాన సభలో ఎంతో ప్రాధాన్యతను కల్పించారన్నారు. అలాగే పత్తికొండ శాసనసభ్యులు కే. ఈ. శ్యామ్ కుమార్ కూడా నియోజకవర్గంలో వాల్మీకులకు పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రామనాథ్ రవికుమార్ పాల్గొన్నారు.


# రాష్ట్రానికి నిధులు శూన్యం

- సిపిఎం సీనియర్ నాయకులు భాస్కర్ రెడ్డి



తుగ్గలి, ఫిబ్రవరి 5(మనం న్యూస్)ః కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి కేటాయించిన నిధులు శూన్యమని మాజీ ఎమ్మెల్యే ఈశ్వర్ రెడ్డి కుమారుడు, సిపిఎం సీనియర్ నాయకులు ఎర్రగుడి భాస్కర్ రెడ్డి అన్నారు. గురువారం జీ. ఎర్రగుడి గ్రామంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2026/27 ఆర్థిక సంవత్సరానికి ఆర్థిక శాఖామంత్రి నిర్మలా శీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రజా వ్యతిరేకమైన బడ్జెట్ అని ఆరోపించారు. సామాజిక న్యాయం అన్న భావన కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలలో ఎక్కడా కనిపించలేదు అన్నారు. మాటలలో సబా కాసాథ్ విధానాలలో కొద్ది మందికే సౌకర్యం, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న హామీలకు యీ బడ్జెట్లో ఎలాంటి ఆధారము లేదన్నారు. కనీస మద్దతు ధరకి చట్టబద్ద హామీపై ఒక్క మాట లేదన్నారు. ఎరువుల సబ్సిడి తగ్గింపు, వ్యవసాయ పెట్టుబడుల స్తబ్దత రైతులను మరింత అప్పులలోకి నెట్టే ప్రమాదము ఉందన్నారు.జ వ్యవసాయ సంక్షోభాన్ని పరిష్కరించే మార్గము యీ బడ్జెట్ లో ఏ కోశాన కనిపించడం లేదన్నారు. రైతులను, కార్మికులను, పేదలను పూర్తిగా విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు.ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక ప్యాకేజీ గాని, విభజన హమీలలో కాని, ఏ ఒక్కటి అమలుకు నోచుకోలేదన్నారు. పోలవరం జాతీయ ప్రాజెక్టుకు రూ.21 వేల కోట్లు అవసరము వుండగా కేవలము రూ.300 కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించారని తెలిపారు. చంద్రబాబు నాయుడు 2027 నాటికి పోలవరం పూర్తి చేస్తానని చెప్పడం ప్రజలను మభ్యపెట్టడానికి తప్ప మరొకటి లేదన్నారు. రైతులు ఆత్మహత్యలు నివారించడానికి స్వామినాథన్ కమీషన్ సిఫార్సులు, ఇంప్లిమెంట్ కోసము బడ్జెట్ లో కేటాయించలేదని, రైతాంగాన్ని పూర్తిగా విస్మరించారని, విద్య, వైద్య రంగాన్ని నిర్లక్ష్యం చేశారని తెలిపారు. తెలుగుదేశం యం.పి.ల ప్రోద్బలంతో కొనసాగుతున్న మోదీ ప్రభుత్వాన్ని చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని విమర్శించకపోగా, పొగడ్తలతో ముంచెత్తడము హాస్యాస్పదంగా వున్నదన్నారు. ఇది ముమ్మాటికి కార్పొరేట్ అనుకూల బడ్జెట్ అని దీనిని ప్రజలందరు వ్యతిరేకించాలని ఆయన కోరారు.పాత్రికేయుల సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి శ్రీ రాములు సిపిఎం నాయకులు కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ నిర్లక్ష్యం - రోడ్లపై పందుల రాజ్యం



దేవనకొండ, ఫిబ్రవరి 05 (మనం న్యూస్)ః దేవనకొండ గ్రామంలో పందులు గుంపులుగా స్వైర విహారం చేస్తూ ప్రజల జీవన విధానాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. గ్రామ పంచాయతీ కార్యాలయ పరిసరాలు, ప్రధాన రహదారులు, అంతర్గత వీధులు అన్నిచోట్లా పందులు తిరుగుతూ వాహనదారులకు, పాదచారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం సమయాల్లో రోడ్లపై అకస్మాత్తుగా పందులు అడ్డుగా రావడంతో చిన్న చిన్న ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పందుల వల్ల చెత్త చిందర వందరగా మారి పరిసర ప్రాంతాల్లో దుర్వాసన వ్యాపిస్తోంది. దీంతో దోమలు, ఈగలు పెరిగి వ్యాధుల ముప్పు కూడా పెరుగుతున్నట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు బయటకు రావాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. కొన్ని ప్రాంతాల్లో పందులు దూకుడుగా ప్రవర్తిస్తూ ప్రజలపై దాడికి ప్రయత్నించిన సంఘటనలూ చోటుచేసుకున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ సమస్యపై పలుమార్లు గ్రామ పంచాయతీ అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం కనపడటం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. పందుల యజమానులపై కఠిన చర్యలు తీసుకోవడం, వీధుల్లో సంచరించే పందులను పట్టుకుని గ్రామానికి బయటకు తరలించడం, పారిశుద్ధ్య చర్యలను క్రమం తప్పకుండా చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రజల భద్రత, ఆరోగ్యం దృష్టిలో ఉంచుకుని తక్షణమే చర్యలు తీసుకోవాలని దేవనకొండ వాసులు కోరుతున్నారు.

## లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్‌కు డాక్టరేట్ ప్రధానం



కర్నూలు, ఫిబ్రవరి 05మనం న్యూస్ః దక్షిణ అమెరికా ఖండానికి చెందిన రిపబ్లిక్ అఫ్ పెరూ దేశానికి చెందిన వరల్ ఫెడరేషన్ ఆఫ్ ద ఆరట్స్ లిటరేచర్ ఎడ్యుకేషన్ పీస్ అండ్ కల్చర్ ఇనిస్టిట్యూట్ యూనివర్సల్ డాక్టరల్ కాలేజీయేట్ కౌన్సిల్ ఆఫ్ ఎక్సలెన్స్, యునైటెడ్ నేషన్స్ చే గుర్తించబడిన ఫెడరేషన్ సంస్థ చే కర్నూలుకు చెందిన ప్రముఖ సామాజికవేత్త నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు గత 35 సంవత్సరాలుగా అనేక సామాజిక కార్యక్రమాలు చేస్తున్నందుకు గాను గుర్తింపుగా లయన్ అంబాసిడర్ డాక్టర్ రాయపాటి శ్రీనివాసుకు నేడు జరిగిన అంతర్జాల అంతర్జాతీయ సదస్సులో వరల్ ఫెడరేషన్ ఆఫ్ ద ఆరట్స్ లిటరేచర్ ఎడ్యుకేషన్ పీస్ అండ్ కల్చర్ ఇనిస్టిట్యూట్ యూనివర్సల్ అధ్యక్షులు మిగుల్ లియోనారుడో గామంరా క్వీరోజ్, రెక్టర్ అఫ్ ది డాక్టరల్ కౌన్సిల్ క్యూడోస్ ది గ్లోబల్ బోర్డ్ మెంబెర్ రూత్ మోరీరా డి మేందేజ్ లు 2025 సంవత్సరానికి గాను అత్యంత ప్రతిష్టత్మాకమయిన గౌరవ డాక్టరేట్ ను అందజేశారు.

## చదువు ఒత్తిడితో కాదు శ్రద్ధతో చదవండి



- విశ్రాంతి ఎమ్మార్వో శిక్షావలి
- కో-ఆప్షన్ మెంబర్ మాబు సాబ్

కౌతాళం, ఫిబ్రవరి 05 మనం న్యూస్ః బదినేహాల్ గ్రామంలో జిల్లా పరిషత్ కన్నడ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థుల మోటివేషన్ తరగతులకు ముఖ్య అతిథిగా హాజరైన విశ్రాంత ఎమ్మార్వో పి.షక్షావలి తాను జన్మించిన ఊరిపై మమకారంతో పదవ తరగతి విద్యార్థుల పై ప్రత్యేక అభిమానంతో మోటివేషన్ శిక్షణ తరగతులకు విశ్రాంత ఎమ్మార్వో శేక్షావలిసార్ ని కౌతాళం మండలం కో ఆప్షన్ మెంబర్ బి.మాబుసాబ్ ఆహ్వానించడం జరిగింది. ఆహ్వానాన్ని మన్నించి షేక్షావలి సార్ గురువారం రోజు హాజరై విద్యార్థులకు పదవతరగతి పరీక్షలను ఏ విధంగా ఎదుర్కోవాలి,ఒత్తిడికి గురికాకుండా శ్రద్ధగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.మనిషి ఉన్నతికి విద్య ప్రధానమైనదని కావున విద్యార్థులు చక్కగా చదివి గ్రామానికి మరియు పాఠశాలకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని పేర్కొన్నారు.మండల కో ఆప్షన్ మెంబర్ బి.మాబుసాబ్ మాట్లాడుతూ మా ఆహ్వానాన్ని మన్నించి మా పాఠశాలను సందర్శించి విద్యార్థులకు తమ విలువైన విషయాలను చెప్పి ఉత్సాహపరిచిన విశ్రాంత ఎమ్మార్వో శేక్షావలి సార్ కి నా ప్రత్యేక ధన్యవాదాలు అలాగే సార్ సూచనలను పాటించి పాఠశాల విద్యార్థులు గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరుకుంటున్నాను అని అలాగే పాఠశాల తరపున ప్రథమ శ్రేణిలో మరియు ద్రుతీయ శ్రేణిలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు నా తరపున ప్రోత్సాహక బహుమతులు అందజేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందము విద్యార్థి విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఐటీఐ కళాశాలలో మెగా జాబ్ మేళా




- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ , ఆర్ఐటీఐ కాలేజ్

పాడేరు నందు ఫిబ్రవరి 6 తేదీన ( శుక్రవారం ): ఉదయం 10గం.ల నుండి సాయంత్రం 4గం.ల వరకు 10 కంపెనీలతో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు అ దినేష్ కుమార్ జిల్లా కలెక్టర్ గారు ఐఅఖి మరియు రోహిణి జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి, ఈ ప్రకటన లో తెలిపారు. ఈ జాబ్ మేళా అపోలో ఫార్మసీ, నవత రోడ్ ట్రాన్స్పోర్ట్, ముత్తూట్ ఫైనాన్స్ , ఫ్లిప్కార్ట్ , వరుణ్ మోటార్స్ ఇతర ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయి. ఇంటర్మీడియట్,డిప్లొమా ,డిగ్రీ , బి.టెక్ మరియు ఆపై చదువు పూర్తిచేసిన నిరుద్యోగ యువతీ యువకులు ఇంటర్వ్యూ కు పాన్ కార్డు ,ఆధార్ కార్డు మరియు సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని తెలిపారు. ఇంటర్వ్యూ లో ఎంపిక కాబడిన అభ్యర్థులకు నెలకు జీతం 10,000/- నుండి 20,000 వరకు ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. ఈ సదవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగ పరుచుకోవాలని రోహిణీ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి, ఏపీఎస్ఎస్డీసీ తెలిపారు.



## తెలుగుదేశం పార్టీతోనే అందరికీ భవిష్యత్తు

- మంత్రి టీజీ భరత్

కర్నూలు ఫిబ్రవరి 05మనం న్యూస్ః తెలుగుదేశం పార్టీతోనే నాయకులందరికీ భవిష్యత్తు ఉంటుందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. కర్నూలు నగరంలోని ఎం.ఆర్.సి ఫంక్షన్ హాలులో తెలుగుదేశం పార్టీ కర్నూలు పార్లమెంట్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మంత్రి టీజీ భరత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్లమెంట్ అధ్యక్షురాలిగా గుడిసె క్రిష్ణమ్మ, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు యాదవ్, ఉపాధ్యక్షులుగా సోమిశెట్టి శ్రీకాంత్, తదితరులు, ఇతర కార్యవర్గం మొత్తం ప్రమాణ స్వీకారం అనంతరం మంత్రి మాట్లాడుతూ అన్ని సమీకరణాలు పరిశీలించి అదిష్టానం కొత్త కమిటీని ఎంపిక చేసిందన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి గుర్తింపు దక్కిందన్నారు. రాబోయే ఏ ఎన్నికల్లో అయినా తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించేందుకు కొత్త కమిటీ కష్టపడాలని ఆయన సూచించారు. ఇక బహిరంగ వేదికల్లో పార్టీకి డ్యామేజ్ అయ్యేవిధంగా ఎవరు ప్రవర్తించొద్దని చెప్పారు. పెద్ద కుటుంబంలాంటి తెలుగుదేశం పార్టీలో నాయకుల మధ్య ఇబ్బందులుంటే కూర్చొని మాట్లాడుకోవాలన్నారు. 19 నెలల కాలంలో రాష్ట్రంలో ఎన్నో అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న మంచి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం జీవితాంతం కొనసాగాలని తాను కోరుకుంటున్నట్లు మంత్రి టీజీ భరత్ అన్నారు. ఇక వైసీపీ నేతల ఆలోచన విధానం ఓడిపోయిప్పటికీ మారలేదన్నారు. ఆ పార్టీలో బూతులు మాట్లాడే వారికి మార్కులు పడతాయన్నారు. వైసీపీ అధ్యక్షునిగా జగన్మోహన్ రెడ్డిని మార్చి వేరే వారికి అవకాశం ఇస్తే బాగుంటుందన్నారు. ప్రజలందరికీ వైసీపీ నేతల అరాచకాలు అర్థమయ్యేలా చెప్పాలని, వైసీపీ ధోరణిని ప్రజలు ప్రోత్సహించే ప్రసక్తి లేదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

# పాకిస్థానే వద్దనుకుంది..

## అయినా మేం కొలంబో వెళ్తాం : సూర్యకుమార్



టీ20 ప్రపంచ కప్ 2026 లో భారత్ తో తాము ఆడాల్సిన లీగ్ మ్యాచ్ ను బహిష్కరిస్తున్నట్లు పాకిస్థాన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. షెడ్యూల్ ప్రకారం భారత్, పాక్ మ్యాచ్ ఫిబ్రవరి 15న కొలంబోలో జరగాల్సి ఉంది. మ్యాచ్ ఆడకూడదని పాక్ తీసుకున్న నిర్ణయంపై భారత జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తాజాగా స్పందించాడు. పాకిస్థాన్ మ్యాచ్ ను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించినా భారత జట్టు కొలంబోకు వెళ్తుందన్నాడు. ''వారి (పాకిస్థాన్) నిర్ణయం నా నియంత్రణలో లేదని భావిస్తున్నాను. ఆడాలా? వద్దా? అనేది వారి ఇష్టం. ఆసియా కప్ లో మేం పాక్ తో మూడు మ్యాచ్ లు ఆడాం. మా మైండ్ సెట్ చాలా క్లియర్ గా ఉంది. పాకిస్థాన్ తో ఆడబోమని మేం చెప్పలేదు. వారే వద్దనుకున్నారు. మ్యాచ్ ను ఐసీసీ షెడ్యూల్ చేసింది. కొలంబో వెళ్లడానికి మాకు విమాన టికెట్లు కూడా బుక్ అయ్యాయి. ఫిబ్రవరి 7న యూఎస్ఏతో ఆడాల్సిన మ్యాచ్ పై మా ఫోకస్ ఉంది'' అని సూర్యకుమార్ యాదవ్ పేర్కొన్నాడు.

టీ20 ప్రపంచ కప్ లో భారత్ తో తమ జట్టు మ్యాచ్ ఆడబోదని పాక్ ప్రధాని షెహబాజ్ వెల్లడించారు. ఇస్లామాబాద్ లో మంత్రివర్గాన్ని ఉద్దేశిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'మేం టీ20 వరల్ కప్ లో భారత్ తో మ్యాచ్ ఆడబోమనే విషయంలో చాలా క్లారిటీతో నిర్ణయం తీసుకున్నాం. క్రీడల్లో రాజకీయాలు ఉండకూడదు. మేం సరైన నిర్ణయమే తీసుకున్నాం'' అని అన్నారు. కానీ తమ జట్టు భారత్ తో ఆడకపోవడానికి గల కారణాలను ఆయన వెల్లడించలేదు.

## ఆసియా షూటింగ్.. మెరిసిన ఇషా



ఆసియా షూటింగ్ ఛాంపియన్ షిప్ లో హైదరాబాదీ షూటర్ ఇషా సింగ్ సత్తా చాటింది. బుధవారం ప్రారంభమైన ఈ టోర్నీలో మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ లో పసిడి పతకం గెలిచిన ఇషా.. టీమ్ విభాగంలోనూ స్వర్ణాన్ని దక్కించుకుంది. వ్యక్తిగత విభాగం ఫైనల్లో ఇషా (239.8) అగ్రస్థానంలో నిలిచింది. చైనీస్ తైపీ అమ్మాయిలు చెంగ్ యెన్ చెంగ్ (235.4) యి అయ్ వెన్ (217.7) వరుసగా రజత, కాంస్య పతకాలు అందుకున్నారు. డబుల్ ఒలింపిక్ పతక విజేత మను బాకర్ ఏడో స్థానంలో నిలిచింది. మహిళల టీమ్ విభాగంలో సురుచి (576), ఇషా (575), మను (575)లతో కూడిన భారత జట్టు (1726) పసిడి కైవసం చేసుకుంది. వియత్నాం (1713) రజతం, చైనీస్ తైపీ (1711) కాంస్యం గెలిచాయి. పురుషుల 10 మీటర్ల పిస్టల్ లో సామ్రాట్ రాణా కాంస్యం నెగ్గాడు. ఫైనల్లో 220.3 పాయింట్లతో అతడు మూడో స్థానంలో నిలిచాడు. వెచ్నికోవ్ (ఉజ్బెకిస్థాన్, 242), రకీమ్ జాన్ (కజకిస్థాన్, 241) తొలి రెండు స్థానాలు సాధించారు. టీమ్ విభాగంలో సామ్రాట్ (581), శ్రవణ్ (578), వరుణ్ తోమర్ (573)లతో కూడిన భారత్ బృందం (1732) రెండో స్థానంలో నిలిచింది. ఉజ్బెకిస్థాన్ (1732) కూడా అన్నే పాయింట్లు సాధించినా.. మధ్య వృత్తానికి సమీపంగా ఎక్కువ పదులు స్కోరు చేయడంతో స్వర్ణాన్ని గెలుచుకుంది. కజకిస్థాన్ (1731) మూడో స్థానంలో నిలిచింది.



## తిరిగి మైదానంలోకి వస్తాననుకోలేదు : తిలక్

నవీ ముంబయి వేదికగా దక్షిణాఫ్రికాతో బుధవారం జరిగిన టీ20 వరల్ కప్ వార్మప్ మ్యాచ్ లో టీమ్ఇండియా 30 పరుగుల తేడాతో విజయం సాధించిన విషయం తెలిసిందే. శస్త్రచికిత్స తర్వాత తిలక్ వర్మ ఈ మ్యాచ్ ద్వారానే మళ్లీ మైదానంలోకి అడుగు పెట్టాడు! కేవలం 19 బంతుల్లోనే 45 పరుగులు చేశాడు. ఇందులో 3 ఫోర్లు, 3 సిక్స్ లున్నాయి. టీమ్ఇండియాలోకి తన పునరాగమనం గురించి తిలక్ వర్మ మాట్లాడాడు. ఈ వీడియోను బీసీసీఐ తన సైట్ లో పోస్ట్ చేసింది. 'ఇంత త్వరగా తిరిగి మైదానంలోకి వస్తానని అనుకోలేదు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, బీసీసీఐకి కతజ్ఞతలు. వరల్ కప్ లో ఆడటం నా కల. నేను మైదానంలోకి అడుగు పెట్టినప్పుడు అందరూ నా పేరును నినదిస్తారని అసలు ఊహించుకోలేదు. అది బాగా నచ్చింది, చాలా ఉత్సాహాన్ని ఇచ్చింది. ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ బ్యాటింగ్ ను చూసిన తర్వాత దూకుడుగా ఆడాలనుకున్నాను. కేవలం వార్మప్ మ్యాచ్ కు అంత మంది ప్రేక్షకులు వస్తారని ఊహించలేదు. కానీ ఆ ఉత్సాహం చాలా అద్భుతంగా ఉంది. ప్రతి ఒక్కరికీ కతజ్ఞతలు. ఈ రోజు వాతావరణం చాలా బాగుంది. తిలక్, ఇండియన్ టీమ్ వరల్ కప్ నకు సిద్ధం' అని తిలక్ వర్మ అన్నాడు. తిలక్ వర్మ 15 టీ20ల్లో మూడోస్థానంలో బ్యాటింగ్ కు దిగి 542 పరుగులు చేశాడు. ఇందులో రెండు సెంచరీలు, మూడు హాఫ్ సెంచరీలున్నాయి. ఆ రెండు శతకాలు కూడా దక్షిణాఫ్రికా గడ్డపై సఫారీల మీదే సాధించాడు.

## ప్రముఖ నటి వాహిని కన్నుమూత



టాలీవుడ్ లో మరో విషాదం చోటుచేసుకుంది. తెలుగు బుల్లితెర మరియు వెండితెరపై తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి వాహిని కన్నుమూశారు. గత కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో పోరాడుతున్న ఆమె, బుధవారం తన స్వస్థలమైన విజయనగరంలో మరణించారు. ఆమె అసలు పేరు పద్మ కాగా, చిత్ర పరిశ్రమలో వాహినిగా ప్రసిద్ధి చెందారు. ఆమె మరణవార్తను తోటి నటి కరాటే కళ్యాణి సోషల్ మీడియా ద్వారా పంచుకుంటూ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. తెలుగు, తమిళ భాషల్లో పలు చిత్రాల్లో నటించినప్పటికీ, వాహినికి టెలివిజన్ రంగం విశేషమైన గుర్తింపును ఇచ్చింది. ముఖ్యంగా సీరియల్స్ లో ఆమె పోషించిన నెగెటివ్ పాత్రలు ప్రేక్షకులకు బాగా గుర్తుండిపోయాయి. విలక్షణమైన నటనతో అలరించిన ఆమె, ఇటీవల విడుదలైన 'బహిర్భూమి' అనే చిత్రంలో కూడా కీలక పాత్రలో కనిపించారు.

వాహిని మృతి పట్ల టాలీవుడ్ ప్రముఖులు మరియు సీరియల్ నటీనటులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. ఆమె మృతితో తెలుగు చిత్ర పరిశ్రమ ఒక మంచి నటిని కోల్పోయిందని పలువురు సంతాపం వ్యక్తం చేశారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, సోషల్ మీడియా వేదికగా ఆమెకు నివాళులు అర్పిస్తున్నారు.

## మార్చిలో పవన్ డబుల్ ట్రీట్..

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ప్రస్తుతం హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంలో నటిస్తున్నాడు. ఈ హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్టైనర్ ను 2026, మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. 'గబ్బర్ సింగ్' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత ఈ కాంబోలో వస్తున్న సినిమా కావడంతో, హరీష్ శంకర్ పవన్ ను ఎంత పవర్ ఫుల్ గా చూపిస్తారో అని ఫ్యాన్స్ వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు.



మరోవైపు, పవన్ కళ్యాణ్ నెక్స్ట్ ప్రాజెక్ట్ పై కూడా క్రేజీ అప్ డేట్ వచ్చేసింది. సుమారు ఐదేళ్ల క్రితం ప్రకటించిన డైరెక్టర్ సురేందర్ రెడ్డి సినిమా ఎట్టకేలకు పట్టాలెక్కనుంది. తాజా సమాచారం ప్రకారం, ఈ చిత్రం తెలుగు నూతన సంవత్సరం ఉగాది పర్వదినం సందర్భంగా లాంఛనంగా ప్రారంభం కానుంది. ఈ లెక్కన మార్చి నెల పవన్ ఫ్యాన్స్ కు డబుల్ ధమాకా అని చెప్పాలి. ఒకవైపు 'ఉస్తాద్' థియేటర్లలో సందడి చేస్తుండగానే, మరోవైపు కొత్త సినిమా షూటింగ్ ప్రారంభం కావడం విశేషం.

ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని ప్రముఖ నిర్మాత రామ్ తాళ్లూరి నిర్మిస్తున్నారు. వక్కంతం వంశీ ఈ చిత్రానికి కథను అందిస్తున్నారు. పాలిటిక్స్ లో బిజీగా ఉన్నప్పటికీ, పవన్ వరుస ప్రాజెక్టులతో దూసుకుపోతుండటంతో బాక్సాఫీస్ వద్ద పవర్ స్టార్ జాతర మొదలైనట్టే కనిపిస్తోంది.

## అలియా @ 'హౌస్‌వైఫ్'?



యాక్షన్, ప్రేమకథలతో వినోదాలు పంచడమే కాదు.. జీవితానికి దగ్గరగా ఉండే కథల్ని తెరపై ఆవిష్కరించి ప్రేక్షకులకు కనువిప్పు కలిగించే సినిమాలూ ఉంటాయి. ఇప్పుడలాంటి చిత్రంతో ఏడడుగుల బంధం గురించి తెలియజేయడానికి గృహిణిగా మన ముందుకు రాబోతుందట బాలీవుడ్ నాయిక అలియా భట్. ఆమె.. హిందీలో 'దృశ్యం 2'ని తెరకెక్కించిన అభిషేక్ పాఠక్ రూపొందిస్తోన్న 'హౌస్‌వైఫ్' అనే చిత్రంలో ప్రధాన పాత్రలో నటిస్తున్నట్లు తెలుస్తోంది. వివాహమైన ఓ జంట చుట్టూ ఈ సినిమా ఉంటుందని సమాచారం. ''ప్రస్తుతం అభిషేక్ పాఠక్ 'దృశ్యం 3' సినిమా చిత్రీకరణతో బిజీగా ఉన్నారు. అది పూర్తయిన తర్వాత ఆగస్టులో 'హౌస్ వైఫ్'ను పట్టాలెక్కించాలని నిర్ణయం తీసుకున్నారు. ఇందులో అలియా కథానాయికగా నటించడమే కాకుండా ఈ చిత్రానికి సహ నిర్మాతగా వ్యవహరించనుంది. ఈ రిలేషన్ షిప్ డ్రామాలో మరో కీలక పాత్ర కోసం రాజ్ కుమార్ రావ్ తో చర్చలు చేస్తోంది చిత్రబృందం. త్వరలో ఈ ప్రాజెక్టు గురించి అధికారికంగా వెల్లడించనున్నార''ని అలియా సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆమె ఖాతాలో 'లవ్ అండ్ వార్', 'ఆల్ఫా' చిత్రాలు ఉన్నాయి.



## డైలమాలో 'లెనిన్'

అక్కినేని యంగ్ హీరో అఖిల్ తన కెరీర్ లో ఎలాగైనా భారీ హిట్ కొట్టాలనే పట్టుదలతో ఉన్నాడు. ప్రస్తుతం ఆయన మురళీ కిశోర్ అబ్బూరి దర్శకత్వంలో 'లెనిన్' అనే మాస్ యాక్షన్ ఎంటర్ టైనర్ లో నటిస్తున్నాడు. రాయలసీమ నేపథ్యంలో సాగే ఈ కథలో అఖిల్ చిత్తూరు యాసలో డైలాగులు చెప్పబోతున్నాడు. ఇప్పటికే విడుదలైన టీజర్, సాంగ్స్కు మంచి రెస్పాన్స్ రావడంతో, ఈ చిత్రాన్ని మే 1, 2026న విడుదల చేస్తామని మేకర్స్ గతంలోనే ప్రకటించారు.

అయితే, తాజా పరిణామాలు చూస్తుంటే 'లెనిన్' విడుదల తేదీ మారే అవకాశం కనిపిస్తోంది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న పాన్-ఇండియా చిత్రం 'పెద్ది'ని ఏప్రిల్ 30, 2026న విడుదల చేయబోతున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. చరణ్ సినిమాకు కేవలం ఒక్కరోజు గ్యాప్ లో అఖిల్ సినిమా రావడం బాక్సాఫీస్ వద్ద రిస్క్ అవుతుందని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి. 'పెద్ది' వంటి భారీ ప్రాజెక్టుతో పోటీ పడితే థియేటర్ల లభ్యత, ఓపెనింగ్స్ పై ప్రభావం పడే అవకాశం ఉండటంతో, లెనిన్ మేకర్స్ తమ సినిమాను వాయిదా వేయాలని ఆలోచిస్తున్నట్లు సమాచారం.

ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్ గా నటిస్తుండగా, సీనియర్ నటుడు శివాజీ ఒక కీలక పాత్రలో కనిపిస్తున్నాడు. థమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను సితార ఎంటర్ టైన్ మెంట్స్ మరియు అన్నపూర్ణ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. మరి ఈ సినిమా రిలీజ్ డేట్ విషయంపై మేకర్స్ నుంచి క్లారిటీ ఎప్పుడు వస్తుందో చూడాలి.



## చైతూ మళ్ళీ ప్రేమ కథతో వస్తాడా?

యువ సామ్రాట్ అక్కినేని నాగచైతన్య ప్రస్తుతం సెలెక్టివ్ గా సినిమాలు చేస్తున్నాడు. 'విరూపాక్ష' చిత్రంతో బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించిన దర్శకుడు కార్తీక్ దండు దర్శకత్వంలో చైతన్య తన 24వ చిత్రం 'వృషకర్మ'లో నటిస్తున్నాడు. భారీ బడ్జెట్ తో మిస్టిక్ థ్రిల్లర్ కథాంశంతో తెరకెక్కుతున్న ఈ సినిమా ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. సుకుమార్ రైటింగ్స్ మరియు శ్రీఇఇ బ్యానర్లపై సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో చైతూ మునుపెన్నడూ చూడని సరికొత్త మాస్ మరియు రఫ్ లుక్ లో కనిపించనున్నాడు.

'వృషకర్మ' సెట్స్ పై ఉండగానే, నాగచైతన్య తన కెరీర్ లో మైలురాయి వంటి 25వ సినిమా కోసం సన్నాహాలు మొదలుపెట్టాడు. తాజా సమాచారం ప్రకారం, ఈ స్పెషల్ ప్రాజెక్ట్ కోసం ఆయన మళ్లీ తనకు అచ్చొచ్చిన ప్రేమకథ వైపే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. గతంలో 'ఏ మాయ చేసావె', 'మజిలీ', 'లవ్ స్టోరీ' వంటి చిత్రాలతో క్లాస్ ఆడియన్స్ కు దగ్గరైన చైతన్య, తన సిల్వర్ జూబ్లీ సినిమాను కూడా ఒక అందమైన ప్రేమకావ్యంగా మలచాలని భావిస్తున్నాడు. ఇటీవల విడుదలైన 'తండేల్' చిత్రం ఆయన కెరీర్ లో బిగ్గెస్ట్ గ్రాసర్ గా నిలవడమే కాకుండా, అందులోని రొమాంటిక్ ట్రాక్ కు మంచి గుర్తింపు రావడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

ఈ 25వ చిత్రానికి దర్శకత్వం వహించే అవకాశం ఎవరికి దక్కుతుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. 'మజిలీ'తో చైతన్యకు కెరీర్ బెస్ట్ హిట్ ఇచ్చిన శివ నిర్వాణ లేదా 'బెదురులంక 2012' ఫేమ్ క్లాక్స్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. 'వృషకర్మ' వంటి ప్రయోగాత్మక చిత్రం తర్వాత ఒక స్వచ్ఛమైన ప్రేమకథతో ప్రేక్షకులను పలకరించడం వల్ల కెరీర్ బ్యాలెన్స్డ్ గా ఉంటుందని చైతూ ప్లాన్ చేస్తున్నాడు. ఒకవేళ 'వృషకర్మ' భారీ విజయాన్ని అందుకుంటే, నాగచైతన్య మార్కెట్ స్టామినా మరింత పెరిగి, ఆయన 25వ చిత్రంపై అంచనాలు ఆకాశాన్ని తాకడం ఖాయం.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No:3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.